VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20, INDIA
: 91(40) 27628194, 27674037
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com
AAERI
QEAC No. E334

# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

సంపుటి: 4 సంచిక: 151, పేజీలు - 08
శనివారం, అక్టోబర్ 5, 2024 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## పాకిస్తాన్‌లో లాక్‌డౌన్
### - ఇంటర్నెట్ బంద్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం పాకిస్తాన్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ కేసుల్లో అరెస్ట్ అయి ప్రస్తుతం జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలంటూ పాక్ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇమ్రాన్ ఖాన్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా రోడ్లపైకి వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అప్రమత్తమైన పాక్ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. రాజధాని ఇస్లామాబాద్ మొత్తం లాక్‌డౌన్ విధించింది. అంతేకాకుండా సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు. పాక్‌లోని ఇతర ప్రాంతాల్లో నుంచి జనం ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఇస్లామాబాద్‌కు మిగితా ప్రాంతాలకు పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. పాకిస్తాన్ వ్యాప్తంగా రోజురోజుకూ పాకిస్తాన్ తెహ్రీకీ ఇన్సాఫ్ - పీటీఐ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్‌కు మద్దతు పెరుగుతుండటంతో అధికారంలో ఉన్న షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి సవాల్‌గా మారింది.

2లో..

## మూసీ రాజకీయంలో బీఆర్ఎస్,
# బీజేపీ తడబాటు
### - మూసీ ప్రక్షాళనపై క్లారిటీ లేని పార్టీలు
### - క్రెడిట్ పోరాటం రివర్స్ - రేవంత్ ట్రాప్‌లో పడ్డాయా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మూసి ప్రక్షాళన ప్రాజెక్టు ప్రత్యేకతను సంతరించుకుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రేవంత్ రెడ్డి మూసి ప్రాజెక్టు విషయంలో ప్రత్యేకమైన ఆసక్తితో ఉన్నారు. విదేశీ పర్యటనల్లోనూ నగరాల్లో ఉన్న నదులను .. వాటి నిర్వహణను పరిశీలించారు. అలాగే హైదరాబాద్‌లోనూ అభివృద్ధి చేయలనుకుంటున్నారు. కేవలం శుభ్రం చేయడం కాకుండా ఆ నది చుట్టూ ఆర్థిక వ్యవస్థను నిర్మించాలని అనుకుంటున్నారు. అందుకే ప్రతి దశలోనూ ఫాలో చేస్తున్నారు. ప్రస్తుతం ఆక్రమణలు తొలగించే దశలో ఉన్నారు. అయితే ఈ ఆక్రమణలు తొలగించే ముందు హైడ్రా కూల్చివేతలు సంచనలం రేపాయి. దాంతో తీవ్ర వివాదాస్పదమయింది. రాజకీయ పార్టీల ఇంత కన్నా మంచి అవకాశం రాదన్నట్లుగా ఆక్రణల కూల్చివేత్లని అడ్డుకుంటామని వెళ్లి ప్రజలకు భరోసా ఇచ్చి వస్తున్నారు. కానీ రేవంత్ రెడ్డి వ్యూహాత్మకమైన అడుగులు ముందుకు వేస్తున్నారు.

#### బీఆర్ఎస్ హయాంలో మూసి ప్రక్షాళన ప్రాజెక్టు

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కొత్తది కాదు. భారత రాష్ట్ర సమితి సర్కారులోనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. ఆక్రమణల్ని గుర్తించారు. మూసిని సుందీరకరణ చేసేందుకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా ఉన్న దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని దానికి ఛైర్మన్ ను చేశారు. కానీ అడుగులు ముందుకు పడలేదు. రేవత్ రెడ్డి ఆ ప్రాజెక్టును లార్జర్ ప్రాజెక్టుగా మార్చారు. అయితే ఇప్పుడు ఆక్రమణల్ని కూల్చివేతను బీఆర్ఎస్ వ్యతిరేకించడం ప్రారంభించింది. బీఆర్ఎస్‌కు బీజేపీ కూడా జత కలిసింది. దీంతో ఆక్రమణదారుల వద్దకు వెళ్లి కూల్చి వేయనివ్వబోమని భరోసా ఇస్తున్నారు. కానీ గతంలో కేటీఆరే ఆక్రమణల్ని కూల్చివేయాలని ఆదేశిస్తున్న వీడియో కాంగ్రెస్ నేతలు వైరల్ చేశారు.

#### మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని చెప్పాల్సిన పరిస్థితి

మూసి ఆక్రమణ దారులు స్వయంగా ఖాళీ చేసి వెళ్లిపోతున్నారని ప్రభుత్వం చెబుతోంది . వారికి ఉచితంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తున్నామని కూడా చెబుతున్నారు. అయితే బీజేపీ నేతలు మాత్రం బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని బెదిరిస్తున్నారని తాను నిరూపిస్తానని అంటున్నారు. కానీ అలాంటి నేతలు తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని చెప్పేలా రేవంత్ రెడ్డి పక్కా వ్యూహం పాటించారు. మూసీని ప్రక్షాళన చేయకపోతే నల్లగొండ ప్రజలు విషం తాగాల్సి వస్తుందన్నారు. మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తే నల్లగొండలో సమస్య వస్తుందన్న అభిప్రాయం

2లో..

# కౌంట్ డౌన్ షురూ
### - ఇక సమరమే



**చండీగఢ్ (ప్రశ్న న్యూస్)** హర్యానాలో పోలింగ్ కు కౌండ్ డౌన్ మొదలైంది. హెూరా హెూరీగా సాగిన ప్రచారం ముగిసింది. తిరిగి అధికారం దక్కించుకునేందుకు బీజేపీ చివరి ప్రయత్నాలు చేస్తోంది. ఎలాగైనా అధికారం దక్కాలనే లక్ష్యం తో కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఇక్కడ సామాజిక సమీకరణాలు పోలింగ్ వేళ కీలకంగా మారుతున్నాయి. తాము ఇచ్చిన హామీలు ఓట్లుగా మారుతాయనే నమ్మకంతో పార్టీలు ఉన్నాయి. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. హర్యానాలో ఎన్నికల ప్రచారం పూర్తయింది. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు పార్టీలు చివరి ప్రయత్నాలు చేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ తో సహా అన్ని పార్టీలు తమ సత్తా చాటుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేసాయి. హర్యానాలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెల్లడికానున్నాయి. హర్యానాలో భారతీయ జనతా పార్టీ మరోసారి విజయం సాధించి, హ్యాట్రిక్ కొట్టాలని ఎన్నికల రంగంలోకి దిగింది. రెండు ఎన్నికల్లో అధికారానికి దూరంగా ఉన్న

2లో..

## హైడ్రా కూల్చివేతలపై
# కీలక పరిణామం
### - రేవంత్ సర్కార్‌కు హైకోర్టు ఆదేశాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలే లక్ష్యంగా కూల్చివేతలు చేపట్టిన హైడ్రా నగరంలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లో భారీ ప్రకంపనలే సృష్టించింది. అయితే ఈ హైడ్రా కూల్చివేతల్లో సామాన్యులకు సంబంధించిన కలల సౌదాలు, స్థలాలు లీజుకు తీసుకుని బతుకుదెరువు కోసం పెట్టిన చిన్నా చితక

2లో..

## లడ్డూలో కల్తీ జరగలేదని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చింది
### - చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న జగన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ జరగలేదని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చిందని సుప్రీంకోర్టు తీర్పుతో సీఎం చంద్రబాబు నిజస్వరూపం బట్టబయలైందని మాజీ సీఎం జగన్ ప్రకటించారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను మీడియాకు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై చంద్రబాబు వేసిన సిట్ ను సుప్రీంకోర్టు రద్దు చేసిందన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ విషయంలో సిట్ అవసరంలేదు, బిట్ అవసరం లేదని జగన్ స్పష్టం చేశారు. అసలు ఏం జరగనిదానికి విచారణ ఎందుకని ప్రశ్నించారు. జరగనిదాన్ని జరిగిందని పదేపదే ప్రచారం చేసుకుంటున్నారు వేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే మామూలుగా ఉండదని

2లో..

# పవన్ వెనుక బీజేపీ ఉందా?
### - పవన్ కల్యాణ్ సనాతన ధర్మం వెనుక జాతీయ వ్యూహం
### - అంతా బీజేపీ కనుసన్నల్లోనే జరుగుతోందా.?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అన్ని మతాలను గౌరవిద్దాం హిందూత్వ ధర్మానికి వస్తున్న ముప్పును తరిమికొడదాం అన్న సింగిల్ పాయింట్ ఎజెండా ద్వారా పవన్ కల్యాణ్ సనాతన ధర్మ రాజకీయాలకు తిరుపతి వేదికగా శ్రీకారం చుట్టారు. ఆయన కేవలం ఏపీకి..లేకపోతే తెలుగు రాష్ట్రాలపై తన ఫోకస్ పెట్టలేదు. తమిళనాడుపైనా ఉత్తరాదిపైనా ప్రభావం చూపేలా సనాతన ధర్మ డిక్లరేషన్ ప్రకటించారు. పవన్ కల్యాణ్ కొత్త తరహా కాషాయ రాజకీయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశం అవుతోంది. ఎందుకంటే పవన్ కల్యాణ్ గతంలో ఇంత తీవ్రంగా హిందూత్వ, సనాతన ధర్మంపై మాట్లాడలేద. ఇప్పుడు మాత్రమే పూర్తి స్థాయి కాషాయ వాదనను వినిపించారు. బీజేపీ వ్యూహంలో భాగంగానే పవన్ ఇలా చేస్తున్నారని అందుకే ఎక్కువ మంది నమ్ముతున్నారు.

#### - పూర్తి స్థాయి కాషాయ వాదిగా మారిపోయిన పవన్

తిరుపతి వారాహి డిక్లరేషన్ సభలో పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం సూటిగా ఉంది. దేశంలో ఇతర మతాలకు లభిస్తున్న ప్రివిలేజెస్ హిందూత్వానికి ఉండటం లేదని పవన్ ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. హిందూత్వంపై దాడి చేసే వారికి సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామన్న వారికీ కోర్టులు రక్షణ కల్పిస్తున్నాయని కానీ అదే అలాంటి మాటలు ఇతర మతాలను ఉద్దేశించి అంటే.. సహించే పరిస్థితి లేదన్నారు. వారి వారి మతాల్ని వారు కాపాడుకుంటున్నారని హిందువులు కూడా ఆ స్ఫూర్తితో ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. తమిళనాడు విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్కడ డీఎంకే వారసుడిగా తెరపైకి వచ్చిన ఉదయనిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మం ఓ వైరస్ వంటిదని దాన్ని నిర్మూలించాలని చేసిన వ్యాఖ్యలను పవన్ ప్రస్తావించారు. ఇతర మతాల గురించి ఎందుకు అలా మాట్లాడరని పవన్ సూటి ప్రశ్న. దానికి సమాధానం కోసమే పోరాడాలని ఆయన చెబుతున్నారు.

#### - దీర్ఘకాల జాతీయవ్యూహంతోనే పవన్ ప్రసంగం

పవన్ కల్యాణ్ హఠాత్తుగా ఇలా పూర్తిగా కాషాయధారిగా మారిపోవడానికి తెర వెనుక ఏం జరిగిందన్నది

2లో..

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
### - పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు



**తిరుమల (ప్రశ్న న్యూస్)** అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు

2లో..

## 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా
# కొత్త క్రీడా పాలసీ
### - సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- తెలంగాణలో కొత్త స్పోర్ట్స్ పాలసీ
- రేవంత్ మార్క్ నిర్ణయాలు
- క్రీడాకారులకు మంచి రోజులొచ్చినట్టే



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త క్రీడా విధానం తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. కొత్త స్పోర్ట్ పాలసీ ముసాయిదాపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై సమీక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను ప్రధానంగా చర్చించి అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు.

2లో..

## సీఎం రేవంత్ బండారం
# బట్టబయలయింది
### - కేటీఆర్ సంచలన ట్వీట్


- రైతు రుణమాఫీ అంశంపై మరోసారి కేటీఆర్ ట్వీట్
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేసిన వ్యాఖ్యలపై స్పందన
- రేవంత్ రెడ్డి బండారం బయటపడిందంటూ పోస్ట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి సంచలన ట్వీట్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేసిన ప్రకటనతో సీఎం రేవంత్ రెడ్డి అసలు బండారం బట్టబయలైందంటూ కేటీఆర్ పెట్టిన పోస్టు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రైతులందరికీ ఆగస్టు 15లోపు 2 లక్షల మేర రుణమాఫీ పూర్తిచేశామంటూ సీఎం రేవంత్ రెడ్డి పదే పదే చెప్తుండగా.. చాలా మందికి కాలేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

2లో..

## ప్రభుత్వాలను విమర్శించినందుకు
# జర్నలిస్టులపై కేసులు పెట్టొద్దు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వాలను విమర్శిస్తూ వార్తలు రాసే జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టొద్దని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ జర్నలిస్టుల రాసే రచనలను ప్రభుత్వ విమర్శగా భావించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయకూడని పేర్కొంది. కాగా, జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ ఉత్తరప్రదేశ్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అభిషేక్ ఉపాధ్యాయ్ పిటిషన్‌పై జస్టిస్ హృషికేష్ రాయ్, ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 4 విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం జర్నలిస్టు రాసిన రాతలను ప్రభుత్వంపై విమర్శలుగా భావించి ఆర్టికల్ రాసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని ఘాటుగా వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడంతోపాటు ప్రజాస్వామ్య దేశాల్లో తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛను గౌరవిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. జరల్నిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్‌పై ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకూడదని పోలీసులను ఆదేశించింది.

# పాకిస్తాన్‌లో లాక్‌డౌన్

దీంతో వాటిని అణిచివేసి రాజధాని వరకు రాకుండా ఉండేందుకు గట్టి చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఇస్లామాబాద్‌ను దిగ్బంధించింది. ఇతర ప్రాంతాల నుంచి ఇస్లామాబాద్‌కు రాకపోకలు నిలిపివేసింది. అంతేకాకుండా సమాచారం కూడా బయటికి వెళ్లకుండా ఇంటర్నెట్ నిలిపివేశారు. సెల్‌ఫోన్ సేవలు కూడా రద్దు చేశారు. ఇస్లామాబాద్‌లోకి ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు చొరబడి ఆయన విడుదలను కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేసే అవకాశం ఉండటంతో అక్కడి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక ఇస్లామాబాద్‌లోకి వచ్చి పోయే మార్గాలను మూసివేసేందుకు ఏకంగా షిప్పింగ్ కంటైనర్లను అధికారులు ఏర్పాటు చేశారు. భారీగా పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని భద్రతగా ఉంచారు. బహిరంగ సభలు, ర్యాలీలు చేయకుండా అన్ని పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. ఎవరైనా ఇస్లామాబాద్‌పై దాడి చేయాలని పథకం రచిస్తే దాన్ని జరగనివ్వబోమని పాక్ అంతర్గత మంత్రి మొహ్సిన్ నఖ్వీ స్పష్టం చేశారు. ఈ నెల 15, 16వ తేదీల్లో షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్‌సీఓ) సమావేశానికి వివిధ దేశాల అధినేతలు వస్తుండటంతో పాక్ అలర్ట్ అయింది. ఎస్‌సీఓ సమావేశానికి మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, చైనీస్ ప్రీమియర్ లీ కియాంగ్ సహా వివిధ దేశాల ఉన్నతాధికారులు, నేతలు వస్తుండటంతో ర్యాలీని వాయిదా వేయాలని ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మరోవైపు.. ఇస్లామాబాద్, రావల్పిండి, కరాచీ వంటి కీలక నగరాలతో పాటు పాకిస్తాన్‌లోని మరికొన్ని పట్టణాల్లోనూ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. పాక్ జాతీయ అసెంబ్లీలో 2022లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి దిగిపోయారు. అయితే తన ప్రధానమంత్రి పదవి పోవడానికి పాక్ సైన్యమే కారణం అంటూ ఆయన ఆరోపించారు. అంతేకాకుండా దాని వెనుక అమెరికా కుట్ర పన్నినట్లు సంచలన ఆరోపణలు గుప్పించారు. ఇదిలా ఉంటే అవినీతి, దేశద్రోహం వంటి వివిధ ఆరోపణల నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్‌పై 150కి పైగా కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన 2023 నుంచి జైలులో ఉన్నారు.

## మూసీ రాజకీయంలో బీఆర్ఎస్,బీజేపీ తడబాటు

కల్పించారు. ఇప్పుడు బీఆర్ఎస్ కూడా .. మూసి ప్రక్షాళకు వ్యతిరేకంగా కాదని నిర్వాసితులకు న్యాయం చేయాలన్నవాదన వినిపించాల్సిన పరిస్థితి వచ్చింది.

### మూసి విషయంలో విపక్షాలను రేవంత్ ఫిక్స్ చేసినట్లే !

గత నాలుగు రోజులుగా మూసి ఆక్రమణల విషయంలో రేవంత్ రెడ్డి వెనుకడుగు వేస్తారని అనుకున్నారు. అందుకే ఆ ఆపేసిన క్రెడిట్ తమకు అంటే తమకు దక్కాలని రాజకీయ పార్టీలు పోటీలు పడ్డాయి. కానీ వెనక్కి తగ్గే ప్రశ్నే లేదని స్పష్టమన సంకేతాలు పంపారు.అంటే. .. మూసి ప్రక్షాళన ప్రాజెక్టు కొనసాగుతుందని తేల్చేశారు. నిజానికి న్యాయవ్యవస్థ కూడా ఆక్రమణల్ని సమర్థించదు. నిబంధనల ప్రకారం కూల్చేయాలనే చెబుతుంది. అందుకే రేవంత్ ధైర్యంగా ముందుకెళ్తున్నారని అనుకోవచ్చు.

# కౌంట్ డౌన్ షురూ

కాంగ్రెస్ తిరిగి అధికారం పీఠం దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది.

### రేసులో ప్రధాన నేతలు

ఈ రెండు ప్రధాన పార్టీలో పాటుగా జేజేపీ, ఏస్పీ, బీఎస్పీ, ఐఎన్ఎల్డీ వంటి ప్రాంతీయ పార్టీలు ఎన్నికల బరిలో ఉండగా, ఢిల్లీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ కూడా తన సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. అటు పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 20,629 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఈ ఎన్నికల్లో 1,031 మంది అభ్యర్థులు బరిలో ఉండగా అందులో 101 మంది మహిళలు ఉన్నారు. బరిలో సీఎం నాయిబ్ సింగ్ సైనీ (లద్వా), భూపేంద్ర సింగ్ హుడా (గర్హి సంప్లా-కిలోయ్), అభయ్ సింగ్ చౌతాలా (ఎల్నాబాద్), దుష్యంత్ చౌతాలా (ఉచన), అనిల్ విజ్ (అంబలా క్యాట్), ఓపీ ధంఖర్ (బద్లా), అనురాగ్ ధండా ( కలయత్), వినేష్ ఫోగట్ (జులానా) వంటి ప్రముఖులు పోటీ చేస్తున్నారు.

### హోరా హోరీ

2019 ఎన్నికల్లో బీజేపీ 40 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచి 31 సీట్లు సాధించింది. ఈ సారి కాంగ్రెస్ గెలుపు పైన ధీమాతో ఉంది. అయితే, కాంగ్రెస్ పైన బీజేపీ పలు కీలక అంశాలను అస్త్రాలుగా మలచుకుంది. రిజర్వేషన్లు, అవినీతి, బుజ్జగింపు, బంధుప్రీతిపై కాంగ్రెస్‌పై దాడి చేసింది. కాంగ్రెస్ తాము ప్రకటించిన ఏడు గ్యారెంటీలు ఓట్లను తెచ్చి పెడతాయని అంచనా వేస్తోంది. బీజేపీ సైతం ప్రధాన హామీలను మేనిఫెస్టోలో ప్రకటించింది. అరవింద్ కేజ్రీవాల్ కూడా హర్యానాలో ప్రచారం చేశారు. బీజేపీ తనను జైలుకు పంపి తన పనిని ఆపిందని ఆరోపించారు. హర్యానాలో తమ పార్టీ మద్దతు లేకుండా ప్రభుత్వం ఏర్పడదంటూ కేజ్రీవాల్ ఆశతో ఉన్నారు. దీంతో, హర్యానా సమరం పైన రాజకీయంగా ఉత్కంఠ పెరుగుతోంది.

# లడ్డూలో కల్తీ జరగలేదని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చింది

హెచ్చరించారు. ఏ అధికారులు వచ్చి ఏం చేస్తారు, తప్పుడు రిపోర్ట్ ఇచ్చినా, తప్పుడు ప్రచారం చేసినా స్వామివారే చూసుకుంటారని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు దేవుడు అంటే భయం, భక్తి లేదన్నారు. తిరుమల లడ్డూ విషయంలో సుప్రీంకోర్టు చంద్రబాబుకు మొట్టికాయలు వేస్తే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సుప్రీంకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబును సుప్రీంకోర్టు తిడితే వైవీ సుబ్బారెడ్డిని తిట్టినట్లుగా ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు నిజ స్వరూపాన్ని సుప్రీంకోర్టు ఎత్తి చూపించిందని పొలిటికల్ డ్రామాలు చేయవద్దని సుప్రీంకోర్టు గట్టిగా చెప్పిందన్నారు. చంద్రబాబుకు దేవుడంటే భక్తి ఉంటే ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. చంద్రబాబు భయం, భక్తి ఉంటే ఇప్పటికైనా పశ్చాత్తాపం రావాలని కానీ ఆయన చెప్పిన అబద్ధాన్నే మళ్లీ మళ్లీ చెబుతున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ట్విట్టర్ లో జగన్‌కు షాక్ ఇని పోస్టులు పెడుతున్నారని కోర్టులు వారిని తప్పుబడితే సోషల్ మీడియాలో మాపై తప్పుడు ప్రచారానికి తెరలేపారని ఆరోపించారు. లడ్డూ విషయంలో కల్తీ జరగలేదని టీటీడీ ఈవోనే చెప్పారు. చంద్రబాబు చెప్పింది తప్పు అని ఈవోనే అంటున్నారని కొన్ని వీడియోలను జగన్ మీడియా ప్రతినిధుల ఎదుట ప్లే చేశారు. లడ్డూ వివాదంలో జాతీయ మీడియా కూడా చంద్రబాబును తప్పు పట్టిందని పేపర్ క్లిప్పింగులు చదివి వినిపించారు. తిరుమలలో గొప్ప వ్యవస్థ ఉందని కల్తీ నెయ్యి వస్తే రిజెక్ట్ చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిరస్కరించామని ప్రతీ నెయ్యి ట్యాంకర్ సర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ మాత్రమే ఉంద చంద్రబాబు మాత్రం లడ్డూ ప్రతిష్టను దిగజార్చారజగన్ మండిపడ్డారు. చంద్రబాబు మంచి వ్యక్తి అయితే ఆధారాలను చూసి సిగ్గుపడాలని ఆయన చేసిన పాపాని ఆయన కూటమి, ఆయనను సమర్థించేవాళ్లే శిక్ష అనుభవించాలని జగన్ అన్నారు.

# పవన్ వెనుక బీజేపీ ఉందా?

ఆసక్తికరమైన అంశంగా మారింది. పవన్ కల్యాణ్ పూర్తిగా బీజేపీ సిద్ధాంతకర్తల ఆలోచన మేరకు వ్యవహరిస్తున్నారని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఇంత హఠాత్తుగా పవన్ సనాతన ధర్మం గురించి ఉద్యమం ప్రారంభించడానికి వెనుక లోతైన దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం ఉంటుందని గట్టిగా నమ్ముతున్నారు. గతంలో తనది కమ్యూనిస్టు భావజాలమని పవన్ చెబుతూ ఉండేవారు. కమ్యూనిస్టు భావజాలానికి సనాతన ధర్మ రాజకీయానికి అసలు పొసగదు. మరి పవన్ అలాంటి ఎందుకు మారిపోయారంటే భారతీయ జనతా పార్టీ దక్షిణాది వ్యూహాన్ని పవన్ ద్వారా అమల చేస్తోందని అనుకోవచ్చు.

### ముందు ముందు మరిన్ని సనాతన ధర్మ రాజకీయాలు ఖాయమే

పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టి మూడున్నర నెలలు మాత్రమే అయింది. ఇంకా పాలనపై పట్టు సాధించలేదు. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ విషయంలో జరుగుతున్న పరిణామాలపై ఆయన కలత చెందారని అనుకోవచ్చు. మొత్తంగా పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి హిందూత్వ నేతగా మారిపోయారని అనుకోవచ్చు. తిరుపతిలో జరిగిన సభలో రాముడి విషయంలో రాహుల్ గాంధీ పైనా విమర్శలు చేశారు. అంటే ఆయన బాట చాలా క్లియర్ గా ఉంది. బీజేపీతో ఆయన బంధం మరింత గట్టి పడిందని అనుకోవచ్చు. మొత్తంగా పవన్ సనాతన ధర్మ పోరాటం ఆషామాషీ కాదని చాలా దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నాయని సులువుగా అర్థం చేసుకోవచ్చని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అటు, కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫలపుష్ప, అటవీ, శిల్ప, ఫోటో ప్రదర్శన శాలలను తితిదే శుక్రవారం ప్రారంభించింది. ప్రవేశ ద్వారంలో ఉంచిన దుర్యోధన పరాభవం, శేషాచల శ్రేణుల సెట్టింగ్, శ్రీ వేంకటేశ్వర సాంప్రదాయ శిల్పకళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన చెక్క, సిమెంట్, లోహ శిల్పాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారిని, పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు, ఆగమ సలహాదారులు, టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

అటు, తిరుమల శ్రీవారికి సీఎం చంద్రబాబు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమలలోని బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం వెండి పళ్లెంలో పట్టువస్త్రాలు తీసుకుని శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి అనంతరం శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు సీఎం వెంట ఉన్నారు.

### వదంతులు నమ్మొద్దు

తిరుమలలో అపచారం జరిగిందన్న ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటనలో స్పందించింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా కొక్కి విరిగిందని అపశ్రుతి చోటు చేసుకుందని వస్తోన్న వార్తలపై స్పష్టత ఇచ్చింది. తిరుమలలో ఎలాంటి అపచారం జరగలేదని.. ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మొద్దని స్పష్టం చేసింది. 'ధ్వజస్తంభంపై గరుడ ధ్వజ పటాన్ని ఎగురవేసే కొక్కి విరిగిపోయిందని, ఇది అపచారమని సోషల్ మీడియాలో విస్తృతంగా వదంతులు వస్తున్నాయి. శ్రీవారి భక్తులు ఇలాంటి వార్తలు నమ్మొద్దు. సాధారణంగా బ్రహ్మోత్సవాలకు ముందే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసుకోవడం ఆనవాయితీ. అవసరమైతే వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చడం సంప్రదాయం. అందులో భాగంగానే భిన్నమైన ధ్వజపటం తాలూకు కొక్కిని అర్చకులు తొలగించి దాని స్థానంలో కొత్త దాన్ని ఏర్పాటు చేశారు. అంతలోపే దీన్ని అపచారం జరిగినట్లుగా కొన్ని ప్రసార మాధ్యమాలు ప్రసారం చేయడం దురదృష్టకరం. తిరుమలలో ఎలాంటి అపచారం జరగలేదు.' అని టీటీడీ స్పష్టం చేసింది.

# హైడ్రా కూల్చివేతలపై కీలక పరిణామం

కంపెనీలు ఉండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ హైడ్రా కూల్చివేతలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్ని గళమెత్తాయి. బీఆర్ఎస్ నేతలు ప్రెస్ మీట్లు పెట్టి, సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ఎండగడుతుండటంతో పాటు క్షేత్రస్థాయిలోకి వెళ్లి బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టును ఆశ్రయించారు. కేఏ పాల్ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై శుక్రవారం (అక్టోబర్ 04న) విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై స్టే విధించాలంటూ కేఏ పాల్ తన పిటిషన్‌లో హైకోర్టును కోరారు. అయితే విచారణ చేపట్టిన న్యాయస్థానం.. హైడ్రా కూల్చివేతలను ఇప్పటికిప్పుడు ఆపేయలేమని స్పష్టం చేసింది. హైడ్రాకు చట్టబద్ధత కల్పించిన తరువాతే కూల్చివేతలు ప్రారంభించాలంటూ హైకోర్టులో స్వయంగా కేఏ పాల్ తన వాదనలు వినిపించారు. ఒకవేళ అక్రమ కట్టడాలను గుర్తిస్తే వాటిని కూల్చివేసేందుకు 30 రోజుల ముందే నోటీసులు ఇవ్వాలని కేఏ పాల్ తెలిపారు. జీవో నెంబర్ 99 మీద స్టే విధించాలని ధర్మాసనాన్ని కేఏ పాల్ కోరారు. ఈ కేసులో ప్రతివాదులైన హైడ్రాతో పాటు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 14వ తేదీకి వాయిదా వేసింది.ఇదిలా ఉంటే హైదరాబాద్‌లో కూల్చివేతల్లో సామాన్యులు తమ ఇండ్లను కోల్పోయామంటూ తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తుంటే హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాత్రం మరోరకంగా చెప్తుండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. మీడియా ముందుకొచ్చి తమ ఇండ్లు కోల్పోయామని చెప్తున్న వాళ్లంతా బాధితులు కాదని నిందితులంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఇదే అంశంపై రంగనాథ్‌ను హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కూల్చివేతల విషయంలో అధికారులు పర్సనల్ ఇంట్రెస్ట్ ఎందుకు చూపిస్తున్నారంటూ ప్రశ్నించింది. ఆదివారం రోజు అర్జెంటుగా కూల్చివేతలు చేపట్టాల్సిన అత్యవసరమేంటని నిలదీసింది. రాత్రికి రాత్రే హైదరాబాద్‌ను మార్చేయాలనుకుంటున్నారా అంటూ ప్రశ్నించింది. నాయ్యస్థానం ఆగ్రహంతో పరిస్థితి కొంచెం సద్దుమణిగినట్టే కనిపిస్తోంది.

# సీఎం రేవంత్ బండారం బట్టబయలయింది

రుణమాఫీపై నెలకొన్ని ఈ గందరగోళ పరిస్థితుల్లో మంత్రి నాగేశ్వర రావు చేసిన ప్రకటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "20 లక్షల మందికి రుణమాఫీ కానే కాలేదన్న వ్యవసాయ మంత్రి ప్రకటనతో సీఎం బండారం మరోసారి బట్టబయలైంది. వందశాతం రుణమాఫీ పూర్తిచేశామని విర్రవీగిన ముఖ్యమంత్రివన్నీ డొల్లమాటలేనని ఇంకోసారి తేలిపోయింది. ఓవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని దగా మరోవైపు 10 నెలలైనా 20 లక్షల మందికి మోసం 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి ?? అధికారిక లెక్కల ప్రకారమే 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో.? చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదు. రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం అన్నదాతలకు కోలుకోని శాపం." అంటూ కేటీఆర్ తన ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే తెలంగాణలో ఇప్పటికే 22 లక్షలకు పైగా అన్నదాతలకు రుణమాఫీ పూర్తి చేశామని ఇంకా 20 లక్షల మంది రైతులకు ఆర్థిక వెసులుబాటు చూసుకుంటూ రుణాలు మాఫీ చేస్తామంటూ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గురువారం (అక్టోబర్ 03న) మీడియాతో తెలిపారు. అయితే రుణమాఫీకి సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నా రాష్ట్రంలోని బీజేపీ నేతలు, బీఆర్ఎస్ పార్టీల నాయకులు రైతుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొల్పుతున్నారని మంత్రి మండిపడ్డారు. వాళ్ల రాజకీయ పబ్బం గడుపుకోవటం కోసం ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని తద్వారా అన్నదాతల్లో తీవ్ర ఆందోళన నెలకొంటోందంటూ తుమ్మల చెప్పుకొచ్చారు.

# 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా కొత్త క్రీడా పాలసీ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ (యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ) తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని పీపీపీ తరహాలో నిర్వహించాలన్నారు.

ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి దానికి ఛైర్మన్‌ను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తి ఉండాలని కూడా సూచించారు. ఈ యూనివర్సిటీలో క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను స్పోర్ట్స్ హబ్‌లో చేర్చాలన్నారు. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఓయూలోని వెలోడ్రోమ్ ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ ఒకే గొడుకు కిందకు తెచ్చి స్పోర్ట్ హబ్‌గా మార్చాలన్నారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితులతో పాటు రాష్ట్ర యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని అభిప్రాయపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. శిక్షణకు దేశ విదేశాల్లో ఉన్న కోచ్‌లను రప్పించాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన మార్గాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ మౌర్య

**తిరుపతి** తిరుమల, తిరుపతి పర్యటన నిమిత్తం రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన మార్గాల్లో పారిశుధ్య పనులను, ఏర్పాట్లను శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలిసి పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు రానున్న నేపథ్యంలో తనపల్లి క్రాస్ నుండి శ్రీనివాససేతు ఫ్లైఓవర్ మీదుగా అలిపిరి వరకు పారిశుధ్య పనులను ఇంజనీరింగ్ హెల్త్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉండాలని, బారికేడ్లు పటిష్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపైన ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని, ముఖ్యమంత్రి పర్యటన మార్గంలో ఫ్లెక్సీలు అడ్డం ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, డి.ఈ.మహేష్, రాజు, ఏసిపి బాలాజీ, రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## భక్తులకు భక్తి శ్రద్ధలతో సేవలు అందించండి

### - టీటీడీ ఈవో జె.శ్యామలరావు

**తిరుమల :** శ్రీవారి సేవకులు ప్రతి భక్తునిలో శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శిస్తూ, అత్యంత భక్తి, అంకితభావంతో, క్రమశిక్షణతో ఉత్తమమైన సేవలను అందించాలని టీటీడీ ఈవో జె శ్యామలరావు కోరారు. తిరుమల ఆస్థాన మండపంలో శుక్రవారం శ్రీవారి సేవకులను ఉద్దేశించి ఈవో మాట్లాడుతూ, వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించేందుకు దాదాపు 4 వేల మంది శ్రీవారి సేవకులను టీటీడీ ఆహ్వానించిందన్నారు. భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవలు, ప్రత్యేకంగా అన్నప్రసాదం, తాగునీరు, లడ్డూ ప్రసాదాల పంపిణీ, శ్రీవారి ఆలయం, కల్యాణకట్ట, బయటి ప్రదేశాల్లో క్యూ లైన్ల నిర్వహణ, అనేక కార్యక్రమాలలో శ్రీవారి సేవకుల సేవలను కొనియాడారు. శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం లేకుండా, 4 వేల మంది శ్రీవారి సేవకులు బ్రహ్మోత్సవంలో భక్తులకు సేవలు అందించడం కోసం ఇక్కడకు రావడం సాధ్యం కాదన్నారు. శ్రీవారు అందించిన ఈ దివ్య అవకాశాన్ని వినియోగించుకొని భక్తులకు నిబద్ధతతో సేవలు అందించాలని పిలుపునిచ్చారు. తకుముందు అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి ప్రసంగిస్తూ, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీవారి సేవా వలంటీర్లు యాత్రికులకు సేవలు అందిస్తున్నారన్నారు. వారి విలువైన మరియు నిస్వార్థ సేవలకు గుర్తింపుగా, టీటీడీ ఇటీవల సుపథం ప్రవేశం ద్వారా శ్రీవారి దర్శన సౌకర్యాన్ని వారికి పునరుద్ధరించిందని చెప్పారు. అదేవిధంగా సేవకులను, సుదూరంగా ఉండే వారి డ్యూటీ పాయింట్‌లకు తరలించడానికి ప్రత్యేక వాహనాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## లంచవతారమెత్తిన ముగ్గురు సీఐలు 13 మంది ఎస్ఐలపై వేటు

**హైదరాబాద్** లంచాల కోసం ఇసుక బకాసురులతో దోస్తీ కడుతున్న ముగ్గురు సిఐలు 13 మంది ఎస్ఐలను వీఆర్ కు అటాచ్ చేస్తూ మల్టీ జోన్ 2 ఐజి వి. సత్య నారాయణ, ఉత్తర్వులు జారీ చేశారు..అక్రమాల్లో భాగం కావడం, అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు పలువురు పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. తెలంగాణలో మల్టీజోన్-2లోని 9 జిల్లాల్లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంలో విఫలమైన పోలీస్ అధికారులను వీఆర్ లో ఉంచారు.ఉంచిన వారిలో సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్, తాండూరు టౌన్ సీఐలతో పాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్ ఎస్, పెన్పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్ఐలు ఉన్నారు.వీరిలో ఇసుక అక్రమ రవాణాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న కొందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు ఐజీ వెల్లడించారు. త్వరలో వారిని లూప్లైన్కు బదిలీ చేయనున్నట్లు చెప్పారు. కాగా, ఇప్పటికే ఒక సీఐ, 14 మంది ఎస్సైలు బదిలీ అయ్యారు.
వికారాబాద్ జిల్లాల్లో అక్రమ ఇసుక రవాణా, అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా, మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన కీలక కేసుల్లో పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు కథనాలు రావడంతో ఉన్నతాధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు.

## బలుసులమ్మకు భక్తుల తాకిడి

### - పండ్లతో అలరిస్తున్న ఆలయం

### - నాలుగు టన్నుల పండ్లతో అలంకరణ

తాడేపల్లిగూడెం పుర దేవత శ్రీ బలుసులమ్మ తల్లి అమ్మవారిని నాలుగు టన్నుల ఫలాలతో అద్భుతంగా అలంకరించారు. యాపిల్ బత్తాయి పుచ్చకాయ కర్బూజా, సీతాఫలం, మామిడి, డ్రాగన్ ఫ్రూట్స్, ద్రాక్ష, ఇలా 20 రకాల పండ్లతో అమ్మవారిని ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు,
ఆలయ నిర్వహకులు శ్రీరంగం అంజి భవాని ఆధ్వర్యంలో దాదాపు 15 మంది కమిటీ సభ్యులు 24 గంటల పాటు శ్రమించి ఈ అలంకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కర్రి జయప్రకాష్ సుంకర ధన బాబు ,చవ్వాకుల రమణ , మల్లిడి రాంబాబు , నీలం సురేష్ ,దాట్ల జగన్నాథరాజు , బొలిశెట్టి సుబ్బారావు సుంకర ప్రసాద్, బైనపాలపు ముఖేష్ , పాబోలు సాయి , పిల్ల పవన్ , పూల చొక్కా , చవ్వాకుల చెంతన్న గంధం విక్కీ , సిహెచ్ సతీష్ , గరగ మోహన్ , ,శ్రీరంగం రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## రేవంత్ రెడ్డి అసలు ముఖ్యమంత్రిలాగా మాట్లాడుతున్నాడా..!

### - రేవంత్ రెడ్డిని సంపడానికి అయినా.. సావడానికి అయినా సిద్ధం ...

### - కన్నీరుమున్నీరవుతున్న మూసీ బాధితులు ..

### - కడుపు మంటతో కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు

**హైదరాబాద్** కండ్ల ముందే తమ ఇండ్లను నిర్దాక్షిణ్యంతో కూల్చివేస్తుండటంతో మూసీ బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. కడుపు మంటతో కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతున్నారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డిపై తమ కోపాన్ని వెల్లగక్కుతున్నారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.35 ఏండ్ల నుండి ఇక్కడ ఉంటున్నాం.. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని ఓ మూసీ బాధితురాలు తెలిపింది. రేవంత్ రెడ్డి అసలు ముఖ్యమంత్రి లాగా మాట్లాడుతున్నాడా అని ప్రశ్నించింది. లక్ష మంది మూసీ బాధితులం జేసీబీలు తీస్కొని రేవంత్ రెడ్డి ఇంటి మీదకు పోతామని వార్నింగ్ ఇచ్చింది. అప్పుడు ఎంతమంది మీద కేసులు పెడతారని ప్రశ్నించింది. రేవంత్ రెడ్డిని సంపడానికి అయినా సావడానికి అయినా సిద్ధమని స్పష్టం చేసింది.మాది అక్రమ ఇల్లు అంటే చెప్పు తీసుకొని కొడతామని బాధితురాలు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ చెత్త మొత్తం పోసే జవహర్ నగర్ చెత్త కుప్పలో మమ్మల్ని ఉండమంటవా అని ప్రశ్నించింది. రూపాయి రూపాయి జమ చేసి కట్టుకొని ఇల్లు వదిలేసి ఆ చెత్త కుప్పలో మేమెందుకు ఉండాలని ప్రశ్నించింది. రేవంత్ రెడ్డినే అక్కడ ఉండమనండని తెలిపింది. ఎవడొచ్చి ఇల్లు కూలుస్తాడో అని నిద్ర పట్టట్లేదని వాపోయింది. రేవంత్ రెడ్డిని సీఎం సీటు నుంచి దింపేస్తామని స్పష్టం చేసింది.

## డీఎస్సీ అభ్యర్థుల ధృవపత్రాలను పరిశీలించిన కలెక్టర్

**నల్గొండ** డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను, సిబ్బంది పరిశీలిస్తున్న ధ్రువపత్రాల ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు .ఎవరైనా అభ్యర్థులు దృవపత్రాల పరిశీలనకు హాజరు కానట్లైతే అలాంటి వారి దరఖాస్తులను లోని ఫోన్ నెంబర్ ఆధారంగా ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకొని నిర్ధారించుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

# ఒక్కేసి పువ్వేసి చందమామ..

# శివుడు రాకాపాయె చందమామ

## - బతుకమ్మ ఈ పాట వెనుకున్న కథ తెలుసా

పంచభూతాలతో మనుషులకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ జరుపుకునే పూల పండుగ బతుకమ్మ. పూలను శివలింగాకృతిలో ఎందుకు పేరుస్తారు? ఒక్కేసి పూవ్వేసి చందమా. శివుడు రాకపాయె సందమామా అంటూ అమ్మవారు ఎందుకు ఎదురుచూశారు? ఔషధాలు నిండి ఉండే రంగురంగుల పూలన్నింటినీ సేకరించి వాటన్నింటినీ ఓ పద్ధతి ప్రకారం శివలింగాకృతిలో పేరుస్తారు. చిన్నగా తయారుచేసినా, పెద్దగా తయారు చేసినా
శివలింగాకృతిలోనే అలంకరిస్తారు. దీనివెనుకున్న ఆంతర్యం ఏంటో వివరిస్తూ ఓ పురాణ గాథ ప్రచారంలో ఉంది. అప్పట్లో తెలంగాణ ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పాలించేవారు. వేములవాడ చాళుక్యుల సామంతులుగా వ్యవహరించేవారు. క్రీ.శ 973లో చాళుక్య రాజైన తైలపాడు రాష్ట్రకూటుల్లో చివరి రాజైన కర్కుడిని వధించాడు. అనంతరం తన కుమారుడైన సత్యాశ్రయుడికి పట్టాభిషేకం చేయించాడు. అప్పటికే వేములవాడలో రాజరాజేశ్వరి ఆలయం ఉండేది. రాజరాజేశ్వరి అంటే అక్కడి ప్రజలకు ఎంతో విశ్వాసం ఉండేది. క్రీ.శ 985 నుంచి 1014 వరకు రాజ రాజ చోళుడు పాలన సాగించాడు. సత్యాశ్రయుడిని యుద్ధంలో ఓడించిన రాజేంద్ర చోళుడు వేములవాడ రాజరాజేశ్వరి ఆలయాన్ని కూల్చేశాడు. అదే సమయంలో ఆలయంలో ఉన్న భారీ శివలింగాన్ని తీసుకెళ్లి రాజేంద్ర చోళుడు తండ్రికి బహుమతిగా అందించాడు. ఆ శివలింగాన్నే బృహదీశ్వరాలయంలో ప్రతిష్ఠించినట్లు తమిళ శిలాశాసనాల్లో ఉంది. వేములవాడ నుంచి శివలింగాన్ని వేరుచేసి తంజావూరులో బృహదీశ్వరాలయంలో ప్రతిష్ఠించడంతో అమ్మవారి తరపున బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ప్రారంభించారు స్థానికులు. పూలను శివలింగాకృతిలో పేరుస్తూ అమ్మవారి బాధను చోళులకు తెలియజేసేలా పాటలు పాడడం ప్రారంభించారు. శివలింగాకృతిలో పూలను పేర్చి మధ్యలో గౌరమ్మను పెట్టి అయ్యవారి కోసం అమ్మవారు ఎదురుచూస్తోందంటూ జాము గడిచినా శివుడు రాలేదంటూ పాటలు పాడారు, ఆ సందర్భంగా పాడిన పాటే ఇది..

ఒక్కేసి పువ్వేసి చందమామా..ఒక్క జాము ఆయె చందమామా..
కింద ఇల్లు కట్టి చందమామా..పైన మఠం కట్టి చందమామా..
మఠంలో ఉన్న చందమామా..మాయదారి శివుడు చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..
గౌరి గద్దెల మీద చందమామా..జంగమయ్య ఉన్నాడె చందమామా..

రెండేసి పూలేసి చందమామా..రెండు జాములయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..

మూడేసి పూలేసి చందమామా..మూడు జాములాయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..

నాలుగేసి పూలేసి చందమామా..నాలుగు జాములాయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడేలా రాకపాయె చందమామా..

ఐదేసి పూలేసి చందమామా..ఐదు జాములాయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..

ఆరేసి పూలేసి చందమామా..ఆరు జాములాయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..

ఏడేసి పూలేసి చందమామా..ఏడు జాములయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..



ఎనిమిదేసి పూలేసి చందమామా..ఎనిమిది జాములాయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..

తొమ్మిదేసి పూలేసి చందమామా..తొమ్మిది జాములాయె చందమామా..
శివపూజ వేళాయె చందమామా..శివుడు రాకపాయె చందమామా..

తంగేడు వనములను చందమామా..తాళ్లు కట్టబోతిరి చందమామా..
గుమ్మడి వనమునకు చందమామా..గుడి కట్టబోయే చందమామా..
రుద్రాక్ష వనమునకు చందమామా..నిద్ర చేయపోయె చందమామా..
నీనోము నీకిత్తునే గౌరమ్మ..నా నోము నాకియ్యవే గౌరమ్మ..

శివపూజ వేలాయె చందమామ..శివుడొచ్చి కూర్చునే చందమామ

### కోరుట్లలో జువ్వడి రత్నాకర్ రావు జయంతి వేడుకల్లో

# పాల్గొన్న. పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ.





మంథని ( ప్రశ్న న్యూస్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కే వన్నెతెచ్చిన గొప్ప నాయకులని .ఏదైనా చేయాలనుకుంటే కంకణం కట్టుకొని పూర్తి అయ్యేవరకు క్రమశిక్షణతో పని చేయాలని రత్నాకర్ రావు చెప్పేవారు అని .సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి దాకా ఎదిగి ఎంతమంది అ బి, వ ా నా న్ని చురగొనడం వెనుక ఎంత కృషి ఉందో అర్థం అవుతుంది. అని ఈ రోజు జువ్వాడి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనడం సంతోషంగా ఉంది అని కొనియాడారు .గత పది సంవత్సరాల క్రితం మా తాత గడ్డం వెంకటస్వామి, జువ్వాడి రత్నాకర్ రావు వారిద్దరినీ కలిసినప్పటి పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. అని డిసిప్లిన్ గా పని చేయాలని నాకు మంచి మాటలు చెప్పిన వ్యక్తి జువ్వాడి రత్నాకర్ రావు. అని .స్వర్గీయ రత్నాకర్ రావు నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు ప్రతిరూపం అని తెలంగాణ సాయుధ పోరాట సమయంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి కొంతకాలం జైలు జీవితం కూడా గడిపిన గొప్ప వ్యక్తి. అని గ్రామ సర్పంచ్ నుంచి ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమై ఉమ్మడి ఏపీకి రాష్ట్ర మంత్రిగా ఎదిగిన ఒదిగివున్న గొప్ప నాయకుడు అని కొనియాడారు పెద్ద పెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పోలీసు సంక్షేమ సంఘం చైర్మన్ గా డా.రామ్ తిలక్ నియామకం



శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)డా.రామ్ తిలక్ ని జాతీయ పోలీసు సంక్షేమ సంఘం చైర్మన్ గా నియామకాన్ని ధృవీకరిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రామ్ తిలక్ గతం లో మానవ హక్కుల అవినీతి నిరోధక శాఖ చైర్మన్ గా మరియు భారత నేపాల్ శాంతి రాయబారిగా సేవలు అందించారు.ఈ సందర్భంగా రామ్ తిలక్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవ చేయడంలో పోలీసులు నిజమైన హీరోలు అనడంలో ఏమాత్రం సందేహం లేదు.
క్లిష్ట పరిస్థితుల్లోనూ పోలీసులు పని చేస్తున్నారు. పోలీసుల కుటుంబాలు ఆరోగ్యం, విద్య, ఉపాధి, నివాస వసతి మొదలైన విషయాలలో అనేక ఇబ్బందులు పడవలసి ఉంటుంది,. జాతీయ పోలీసు సంక్షేమ విభాగం ద్వారా పోలీసులు మరియు వారి కుటుంబాల కోసం అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేయబడ్డాయి.వారి సంక్షేమం,భద్రత,ఆరోగ్య భద్రత,మ్యారేజ్ లోన్స్,ఎడ్యుకేషన్ లోన్స్,హెల్త్ బెనిఫిట్స్ మరెన్నో సేవలను పెంపొందించే అవకాశం వచ్చినందుకు హర్షం వ్యకతంచేశారు దేశంలోని అతిపెద్ద మెట్రోపాలిటన్ పోలీసు బలగాల కుటుంబాల భౌతిక, భావోద్వేగ, మేధోపరమైన, ఆధ్యాత్మిక మరియు ఆర్థిక అవసరాలను తీర్చడం ప్రధాన లక్ష్యంతో ఈ సంస్థ స్థాపించబడింది. వారి విధుల యొక్క కఠినమైన మరియు ఖచ్చితమైన స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, జాతీయ పోలీసు సిబ్బంది మరియు వారి కుటుంబాల మొత్తం శ్రేయస్సు సమాజానికి అప్పగించబడింది. ఈ సందర్భంగా గా ఆయన తన శక్తి వంచన లేకుండా కృషి చేసి పోలీసులకు వారి కుటుంబ సభ్యులందరికీ శాంతి సమరస్యలు భంగం కలగకుండా కృషి చేస్తా అన్నారు.

# దేవీ నవరాత్రుల ప్రాశస్తం



### రవికుమార్ సంతోజు బడంగ్ పేట్



**- అమ్మవారికి తొమ్మిది రోజులు తోమ్మిది రూపాలలో ఎందుకు కొలుస్తారు.**

**- నవరాత్రుల వెనుక ఉన్న అసలు చరిత్ర ఏంటి**

దేవీ నవరాత్రులు ప్రతీ సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు దేవీ నవరాత్రులు లేదా శరన్నవరాత్రులుగా జరుపుకుంటారు.ఆశ్వీయుజ మాసం నుండి వర్ష ఋతువు వెళ్ళి,శరత్ ఋతువు ప్రారంభం సమయంలో వచ్చే పండగ కావున శరన్నవరాత్రులు అంటారు. ఈ ఋతువులో వర్షాకాలం ముగిసి చలికాలం మొదలవుతుంది. ఈ సమయంలో వాతావరణంలో కలిగే మార్పులతో అనేక రోగాలకు కారణమవుతాయి. అందుకే ఈ అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా శుచిగా, శుభ్రంగా ఉండడంతో ఎలాంటి రోగాల దరిజేరవన్నది ఈ నవరాత్రి వేడుకల వెనుక ఉన్న చరిత్ర. మార్కండేయ మహర్షి అమ్మవారిని ఎలా ఆరాధించాలి అని అడగడంతో బ్రహ్మ దేవుడు నవరాత్రుల నిర్వహించే విధానాన్ని తెలుపుచు

%××% ప్రధమంశైలపుత్రిణి, ద్వితీయం బ్రహ్మచారిణి
తృతీయం చంద్రఘంటేతి, కూష్మాంతేతి చతుర్థామ్ఎం
పంచమం స్కంధమాతేతి షష్ఠమం కాత్యాయనీ తిచ
సప్తమం కాళరాత్రంచ, మహాగౌరేతి చాష్టమం
నవమం సిద్ధితి ప్రోక్త, నవదుర్గ ప్రకీర్తితఎం

### - శైలపుత్రి

దుర్గాశరన్నవరాత్రుల్లో పాడ్యమి నాడు ప్రారంభమయ్యే అవతారం శైలపుత్రి. దక్షుని ప్రథమ పుత్రిక. శిరస్సున అలంకారంగా బాల చంద్రరేఖను ధరించి ప్రతిశూలాన్నీ చేత బట్టి ఎద్దు వాహనంపై కూర్చునే అవతారమే శైలపుత్రి. పరమేశ్వరుడే తనకు పతికావాలని కోరుతుంది. ఆమె కోరిక ప్రకారం హిమవంతునికి పుత్రికగా జన్మించింది. ఆమె వాహనం ఎద్దు. ఎద్దులా మొద్దు స్వరూపాలై పోకుండా మానవుల్లో చురుకుదనాన్ని కల్గించడానికి సంకేతం శైలపుత్రి. ఈ రోజు అమ్మవారికి పొంగలి నైవేద్యం పెట్టి అర్చిస్తే అభీష్ట సిద్ధి కలుగుతుంది.

### - బ్రహ్మచారిణి

దుర్గామాత రెండవ అవతారం బ్రహ్మచారిణి. పరమేశ్వరుని భర్తగా పొందడానికి నారదుడి ఉపదేశానుసారం ఘోరతపస్సు చేస్తుంది. ఆకులు కూడా తినకుండా ఉన్నందున అపర్ణగా ప్రసిద్ధి చెందింది. పరమేశ్వరుని భర్తగా పొందే వరకు ఈమె బ్రహ్మచారిణి. ఈమెకే కన్యాకుమారి అనే మరో పేరుంది.ఈ మాతను ఉపాసించే వారికి సర్వత్రాసిద్ధి విజయాలు ప్రాప్తిస్తాయి.

### - చంద్రఘంట

అమ్మవారి మూడవ అవతారం చంద్రఘంట ఈ రూపం మిక్కిలి కళ్యాణ కారకం. శిరస్సుపై ధరించిన అర్థచంద్రుడు అర్థాకృతలో ఉండటం వల్ల ఆమెకు చంద్రఘంట అని పేరు వచ్చింది. ఈ తల్లిని శరణుజొచ్చినవారికి ఎల్లప్పుడు అభయఘంట మోగుతు ఉంటుంది.

### - కూష్మాండ

నాలుగవ స్వరూప నామం కూష్మాండ. అంటే బూడిద గుమ్మడికాయ ఈమె తేజోమయి. ఎనిమిది భుజాలతో విరాజిల్లుతుండటం వల్ల ఈమెను 'అష్టభుజదేవి' అని కూడా అంటారు.

### - స్కందమాత

అయిదో అవతారం స్కందమాత. స్కంధుడు అనగా కుమార స్వామి. స్కందుని తల్లి అయినందున ఈమెను స్కందమాత అని పిలుస్తారు. ఈ తల్లి వాహనం కమలాసనంపై పద్మాసనంగా శ్వేతపద్మంతో శోభిల్లుతుంది. తనను నమ్మిన భక్తులకు పతనం లేకుండా ఆ అమ్మ ఉద్ధరిస్తుందునటానికి సంకేతమే ఇది.

### - కాత్యాయని

దుర్గామాత ఆరో రూపం కాత్యాయని. 'కొత్స' అనే రుషి తనకు పార్వతీమాత కుమర్తెగా జన్మించాలని తపస్సు చేశాడు. అతనికి కూతురుగా జన్మించింది. కనుకనే కాత్యాయని అనే పేరు వచ్చింది. మహిషాసురుణ్ని వధించడానికి బ్రహ్మవిష్ణు మహేశ్వరులు తమ తేజస్సుల అంశతో ఒక దేవిని సృష్టిస్తారు. మొట్టమొదట ఈ కాత్యాయనిని మహర్షి పూజిస్తారు. ఈమె ఆశ్వయుజ శుక్లసప్తమి, అష్టమి, నవమి తిథుల్లో పూజలందుకుని విజయదశమినాడు మహిషాసురుణ్ని వధిస్తుంది.

### - కాళరాత్రి

దుర్గామాత ఏడో రూపం కాళరాత్రి. ఈమె శరీరం ఛాయ చీకటివలె నల్లగా ఉంటుంది. ఇందుకే ఈదేవికి కాళరాత్రి అని పేరు. ఈమె వాహనం గాడిద. ఈ తల్లి ఎప్పుడు శుభ ఫలితాలను ఇస్తుంది. అందువలన ఈమెను శుభంకరి అని కూడా పిలుస్తారు.

### - మహాగౌరి

ఈమె పరమేశ్వరుడిని భర్తగా పొందటానికి కఠోర తపస్సు చేస్తుంది. దీని కారణంగా ఈమె దేహం నల్లబడుతుంది. ఆమె తపస్సుకుమెచ్చి ఆమె శరీరాన్ని గంగాజలంతో ప్రక్షాళనం చేస్తారు. దాని వలన ఆమె శరీరం గౌరవర్ణతో విద్యుత్తు కాంతులను వెదజల్లుతు ఉంటుంది. అప్పటి నుంచి ఆమె మహాగౌరిగా ప్రసిద్ధి కెక్కింది.

### - సిద్ధిధాత్రి

దుర్గామాత తొమ్మిదవ శక్తి రూపం సిద్ధిధాత్రి. ఈమె అన్ని సిద్ధులను ప్రసాదిస్తుంది. పరమేశ్వరుడు సర్వ సిద్ధులను ఈదేవీ కృపతో పొందాడని దేవీ పురాణాలు చెబుతున్నాయి.

### - నవరాత్రులలో ఆరాదించే దేవి రూపాలు

- మొదటిరోజు - ఆశ్వయుజ పాడ్యమి - శ్రీ స్వర్ణ కవచాలంక్రుత దుర్గా దేవి

- రెండవ రోజు - ఆశ్వయుజ విదియ - శ్రీ బాలా త్రిపురసుందరీదేవి
- మూడవ రోజు - ఆశ్వయుజ తదియ - శ్రీ గాయత్రి దేవి

- నాల్గవ రోజు - ఆశ్వయుజ చవితి - శ్రీ అన్నపూర్ణా దేవి

- ఐదవ రోజు - ఆశ్వయుజ పంచమి - శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి - లలిథ పంచమి

- ఆరవ రోజు - ఆశ్వయుజ షష్టి - శ్రీ మహా లక్ష్మీ దేవి - మహాషష్టి

- ఏడవ రోజు - ఆశ్వయుజ సప్తమి - శ్రీ మహా సరస్వతీ దేవి - మహా సప్తమి

- ఎనిమిదవ రోజు - ఆశ్వయుజ అష్టమి - శ్రీ దుర్గా దేవి - దుర్గాష్టమి

- తోమ్మిదవ రోజు - ఆశ్వయుజ మహానవమి - శ్రీ మహిషాసురమర్దిని - మహార్ణవమి

- పదవ రోజు - ఆశ్వయుజ దసమి - శ్రీ రాజరాజేశ్వరి - విజయదశమి

ఆశ్వీయుజ మాసం శుద్ధ పాడ్యమిలో నవరాత్రుల కలశ స్థాపన చేసి తొమ్మిది రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందువలన 'దేవీనవరాత్రులు ' అని పిలవ బడుచున్నాయి.

# పిడీఎస్ రైస్ స్వాధీనం

## - తొమ్మిది మంది అరెస్టు

**మేడ్చల్** ఉప్పల్ పారిశ్రామికవాడలో అక్రమంగా డంపింగ్ చేసిన పీడిఎస్ రైస్ ని ఉప్పల్ పోలీసులు పట్టుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి తక్కువ ధరలకు కొని ఉప్పల్ పారిశ్రామిక వాడలో సుమారు వంద బస్తాలలో నలభై ఐదు క్వింటాలు బియ్యాన్ని దుండగులు డంపింగ్ చేసారు. పిడిఎస్ రైస్ ని, డంపింగ్ ప్రాంతం నుండి గుజరాత్ కి తరలించే క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు డంపింగ్ గోదాంపై పోలీసులు దాడి జరిపారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, నాలుగు ట్రాలీ ఆటోలు, గుజరాత్ కి చెందిన ఒక టర్బో లారీని స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు...

### తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందు

# గ్రూప్1 పోస్టర్ల కలకలం

**హైదరాబాద్** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ముందు గ్రూప్ 1 పోస్టర్లు కలకలం రేపాయి. కమిషన్ కార్యాలయం గోడలకు,గేట్లకు పోస్టర్లు వెలిసాయి. నాంపల్లి లోని టీజీపిఎస్సీ, హైదర్ గూడ లోని తెలుగు అకడమిల ముందు పోస్టర్లు కనిపించాయి. తెలుగు అకాడమి పుస్తకాలు పోటీ పరీక్షలకు ప్రామాణికం కాదని... ప్రభుత్వం కోర్టుకు చెప్పిన నేపథ్యంలో వాటిని ఎవరు కొనవద్దని విజ్ఞప్తి చేస్తూ పోస్టర్లు లో పేర్కొన్నారు. అలాగే టిజీపీఎస్సి ముందు నేను ఒక నియంతని.... తప్పు జరిగితే ఒప్పుకోను అని పోస్టర్లు వెలిసాయి. గ్రూప్1 లో 150ప్రశ్నలు తయారు చేయలేని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎందుకు అంటూ సిగ్గు..సిగ్గు అని పోస్టర్లలో వ్యాఖ్యాలున్నాయి.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**కాకినాడ** కాకినాడ జిల్లా కేంద్రం కాకినాడ నగరంలోని రామారావు పేట లో మందు పార్టీ చేసుకుంటూ పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నారు. ఈ సమాచారం పోలీసులకు తెలిసింది .తొలుత క్రైమ్ సీఐ కృష్ణ బృందం దాడి చేసింది .
ఇది టూ టౌన్ పరిధిలో ఉండడంతో టూ టౌన్ సి ఐ చేరుకోవడంతో క్రైమ్ సీఐ బృందం వెళ్లిపోయింది.పేక ఆడుతున్నవారు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడినప్పటికీ రాజకీయ ఒత్తిడి మేరకు ఎలాంటి కేసులు పెట్టకుండా పోలీసులు వదిలేసినట్లు సమాచారం. భారీ ఎత్తున నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా పేకాట రాయుళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# దేవి వైభవం ఉత్సవ శోభితం

- శాస్త్రోక్తకరంగా ఉత్సవాలకు అంకురార్పణ
- బ్రహ్మచారిణి అమ్మవారి గా దర్శనం
- మయురవాహన సేవ పై ఆదిదంపతులు విహారం
- చంద్రఘంట వాహనం పై స్వామి అమ్మవార్ల ఉత్సవం





శ్రీశైలం ( ప్రశ్న న్యూస్) దసరా మహోత్సవాలలో, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించబడ్డాయి. అనంతరం రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలు జరిపించబడ్డాయి. అదేవిధంగా జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన,చండీ హోమం జరిపించబడుతాయి. కాళరాత్రిపూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీపూజలు జరుగనున్నాయి. కుమారి పూజ ప్రతీరోజు కుమారి పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ కుమారిపూజలో రెండుసంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయస్సు ఉన్న



బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరుగుతోంది. కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం బ్రహ్మచారిణి అలంకారం ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారంలో భాగంగా సాయంత్రం శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని బ్రహ్మచారిణి స్వరూపంలో అలంకరింపజేయడం జరిగింది. నవదుర్గలలో ద్వితీయ రూపమైన ఈ దేవిని పూజించడం వల్ల విశేష ఫలితాలు కలగగడంతో పాటు సర్వతా విజయాలు లభిస్తాయి. బ్రహ్మచారిణి ఉపాసన వలన త్యాగ, వైరాగ్య భావాలు కలుగుతాయని దేవీభాగవతంలో చెప్పబడింది. అందుకే ఈ స్వరూపాన్ని సిద్ధులు, మయూరవాహనసేవ ఈ ఉత్సవాలలో శ్రీ స్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా ఈ రోజు మయూరవాహనసేవ జరిపించబడుతుంది. ఈ వాహనసేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, మయూరవాహనంపై వేంచేపు చేయించి పూజాదికాలు చేయబడుతాయి. అనంతరం గ్రామోత్సవము జరిపించడుతుంది.

## బీజేపీ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



నాగోల్ (ప్రశ్న న్యూస్) బీజేపీ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం అన్ని శ్రీ విద్యా శక్తి పీఠాల వద్ద దేవి శరన్నవరాత్రల సందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా నాగోల్ పరిధి అల్కాపురి శ్రీ విద్యా శక్తి పీఠం లో కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. నరేంద్రమోడి నాయకత్వం లో భారత దేశం విశ్వం గురు స్థానాన్ని తిరిగి పొందడం ఖాయమని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అబివృద్ధి కి ప్రజలంతా బ్రహ్మ రథం పట్టి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని కార్యక్రమం లో పాల్గొన్న ధార్మిక సంస్థ సభ్యులు అన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిపై

# కేసు నమోదు చేసిన.

### మంథని ఎస్ఐ డి. రమేష్



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల పరిధిలోని విలోచవరం గ్రామం గోదావరి నది నుండి మంథని కి ఇసుకను ట్రాక్టర్ లో తరలిస్తున్నారని సమాచారం రాగా వెంటనే విలోచవరం గ్రామ శివారులో వెళ్లేసరికి ఒక ట్రాక్టర్ ఎదురుగా ఇసుకను నింపుకొని వస్తుండగా అట్టి ట్రాక్టర్ నీ ఆపి అనుమతి పత్రాలను అడుగగా ఎలాంటి అనుమతులు చూపించక పోయేసరికి కేసు నమోదు చేయడమైనది . ట్రాక్టర్ ని సీజ్ చేయడం జరిగింది. అని అట్టి ట్రాక్టర్ డ్రైవర్ యొక్క వివరాలు అడగగా అతని పేరు మీసాల నరేష్, విలోచవర గ్రామమునకు చెందిన వ్యక్తిగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. అలాగే కేసు కూడా నమోదు చేయడం జరుగుతుంది అని మంథని ఎస్ఐ డి.రమేష్ తెలియజేసినారు

## మల్లన్న సన్నిధిలో శ్రీగోకులంలో

# గ్రాససమర్పణకు ఏర్పాట్లు చేస్తున్నా ఈఓ పెద్ది రాజు

**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** హేమారెడ్డి మల్లమ్మ మందిరం ఎదురుగా నిర్మించిన శ్రీగోకులంలో భక్తుల గోవులకు గ్రాసాన్ని సమర్పించే ఏర్పాట్లు చేయబడ్డాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు శ్రీగోకులంలో గోమాతలకు పూజాదికాలు జరిపి గ్రాసమర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శ్రీగోకులం సుమారు 40 అడుగుల విస్తీర్ణములో సర్కిల్గా (గుండ్రంగా) నిర్మించబడింది. దాతల సహకారంతో ఈ నిర్మాణాన్ని చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ శ్రీగోకులంలో భక్తులు సౌకర్యవంతంగా గోవుకు గ్రాసాన్ని సమర్పించే ఏర్పాటు చేయాలని గో సంరక్షణవిభాగాన్ని ఆదేశించారు. భక్తులు కూర్చునేందుకు వీలుగా శ్రీగోకులంలోనూ మరియు గోకుల పరిసర ప్రాంతంలోని పచ్చికబయలు ప్రదేశంలో బెంచీలను ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించారు. కాగా హేమారెడ్డి మల్లమ్మ మందిరం ముందుభాగంలో మరిన్ని దేవతా వృక్షాలను నాటాలని ఉద్యానవనవిభాగాన్ని ఆదేశించారు. మల్లమ్మ మందిరం లోపల ముఖమండపంలోకి ప్రవేశించే మెట్లమార్గంపైన మరియు ముఖమండపం నుంచి వెలుపలికి వచ్చే మెట్లమార్గంపైన కూడా



షెడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. దీనివలన భక్తులకు వేసవికాలంలోనూ మరియు వర్షకాలంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అదేవిధంగా మల్లమ్మ మందిర ప్రాంగణంలో గల షెడ్డులో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు, సేద తీరేందుకు వెంటనే తగు ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ప్రస్తుతం ఈ షెడ్డును ఎక్కువగా ఉగాది సమయంలో మాత్రమే భక్తులు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించబడుతోంది. అలాగే



మల్లమ్మ మందిర ప్రాంగణంలో ఎడమవైపున లోతట్టు ప్రదేశంలో నడకదారులను ఫుట్పాతులను) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా కార్యక్రమములో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఎమ్. నరసింహరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ( ఐ/సి) పి. చంద్రశేఖరశాస్త్రి, ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ( ఐ /సి) పి.వి. సుబ్బారెడ్డి, గోశాల విభాగపు పర్యవేక్షకులు జి. రవి, ఉద్యానవన అధికారి జి. ఈశ్వరరెడ్డి, గోశాల సిబ్బంది, సంబంధిత అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## లేబర్ డిపార్ట్మెంట్ సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించాలి

### బూడిద గణేష్ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు..



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని లేబర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న భవన నిర్మాణ కార్మికులు. గత నెల రోజులుగా లేబర్ డిపార్ట్మెంట్లో ఇంటర్నెట్ సాంకేతిక సమస్య తలెత్తుతుంది. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులు దరఖాస్తుదారులు మీసేవ కేంద్రాల చుట్టూ లేబర్ కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతూ నిరాశ చెందుతూ. ఏం చేయాలో తెలియక వెను తిరిగి వెళ్లిపోతున్నారు. లబ్ధిదారులు క్లైమ్ చేసుకునే విషయంలో గడువు దాటిపోతే స్కీంకు దూరమవుతారని దీనికి బాధ్యులు ఎవరని. ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే లేబర్ డిపార్ట్మెంట్లో నెలకొన్న ఇంటర్నెట్ సాంకేతిక సమస్యను పరిష్కరించాలని ఇట్టి విషయంలో సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మికులను అందరిని సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ప్రభుత్వాన్నే మోసగించిన

# వనపర్తి ఈఎస్ ప్రభు వినయ్ ను టర్మినేట్ చేయాలి

- 3 నెలల నుంచి విధులకు హాజరు కాకుండా ఽ జీతం తీసుకుంటున్న వైనం
- సర్వీస్ రిజిస్టరును టాంపరింగ్ చేసిన ఘనుడు
- సీనియారిటీ జాబితాలో అక్రమాలకు పాల్పడటమే కాకుండా చట్టవిరుద్ధంగా సర్వీస్ పొడిగించుకున్న క్రిమినల్
- పుట్టినతేదీని 06.06.1964 నుండి 06.06.1969 కి మార్చుకున్న మేధావి
- బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వాన్నే మోసగించిన వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్ కుమార్ ను వెంటనే సర్వీస్ నుండి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ ఏ ఎం రిజ్వి ని అయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ ప్రభు వినయ్ కుమార్ గత 3 నెలల నుంచి విధులకు హాజరు కాకుండా, హాజరు రిజిస్టర్ మరియు ఫైళ్లను ఇంటి వద్దకే తెప్పించుకుని సంతకాలు చేస్తూ జీతం తీసుకుంటున్నాడని వనపర్తి జిల్లా కలక్టర్ కి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసి వారం రోజులైనా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రభు వినయ్ సీనియారిటీ జాబితాలో అక్రమాలకు పాల్పడటమే కాకుండా చట్టవిరుద్ధంగా



సర్వీస్ పొడిగించుకున్నాడని, సర్వీస్ రిజిస్టరులో పుట్టినతేదీని 06.06.1964 నుండి 06.06.1969 కి మార్చుకున్నాడని అన్నారు. 2014 లో విడుదల చేసిన సీనియారిటీ లిస్టులో సీరియల్ నెంబర్ 73 కాగా, 2024 లో విడుదల చేసిన సీనియారిటీ లిస్టులో 32 గా ఉందని, దీంతో నిజాయితీ గల అధికారులు నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రభు వినయ్ పదవ తరగతి సర్టిఫికేట్లను, బోనఫైడ్ తదితర విద్యార్హత సర్టిఫికేట్లతో పాటు %×ఖీవీ×ూ% మరియు ఇన్సూరెన్స్ బాండ్లను పరిశీలించాలని, భవిష్యత్తులో ఏ ఉద్యోగి కూడా ఇటువంటి టాంపరింగ్ లకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సింగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈయన యూనిఫాం సర్వీసుకు అన్ ఫిట్ అని, ఈయనకు ఫిజికల్ పరీక్షలు నిర్వహించి ఫిట్ గా ఉన్నాడా లేదా అని తేల్చాలని కోరారు. అన్ని ఆధారాలతో ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ తో పాటు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కి, మరియు ఎక్సైజ్ కమిషనర్ కి కూడా ఫిర్యాధు చేశామని , అతని అక్రమాలపై వెంటనే విచారణ జరిపి ప్రభుత్వాన్ని మోసం చేసిన ఆయనపై మరియు అతనికి సహకరిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఏసి నాయకులు బడే సాబ్, రాఘవేందర్ గౌడ్, మ్యాదరి రాజు తదితరులు ఉన్నారు.

## మంథనిలో మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు .తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని పంటలు సమృద్ధిగా పండాలని రైతుల కళ్ళలో ఆనందం చూడాలని మంత్రి కోరుకున్నారు ప్రత్యేక పూజలు నిర్వహించి నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమాదేవి, ఒడ్నాల శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, తొట్ల తిరుపతి యాదవ్, బండారి ప్రసాద్, నాగరాజ్ ,వంగల తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబును ఘనంగా సన్మానించిన గౌరవ అధ్యక్షులు మాచేడి రవితేజ గౌడ్



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు మచిడి రవితేజ గౌడ్, అధ్యక్షుడు తాటి బాలయ్య, ప్రధాన కార్యదర్శి భీముని గోపాల్, కార్యదర్శి నరేష్ గౌడ్, ఉపాధ్యక్షులు తాటి సమ్మయ్య గౌడ్, కోశాధికారి కోంద్ర శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు మార్చేడి సత్యనారాయణ గౌడ్, ఆరెల్లి మల్లయ్య గౌడ్, తాటి సమ్మయ్య గౌడ్, రాజయ్య గౌడ్, మోహన్ గౌడ్, తాటి లచ్చయ్య గౌడ్ ,ఎల్లయ్య గౌడ్,గీత కార్మిక సంఘం నాయకులు మంత్రిని ఘనంగా శాలువాతో సన్మానించారు. నూతన కార్యవర్గనికి మంత్రి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గీత కార్మికులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు

## కీర్తిశేషులు ఆరేల్లి వెంకటి కుటుంబాన్ని

# పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

మంథని (ప్రశ్న న్యూస్) రామగిరి మండలం రామయ్య పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామగిరి మండల తాజా మాజీ ఎంపీపీ అరేల్లి దేవక్క. వారి బంధువులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కీర్తిశేషులు అరేల్లి వెంకటి చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాగుభూతి వ్యక్తం చేసిన ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# నాకో పదవి అంటున్న సోము..

**రాజమండ్రి :** సోము వీర్రాజు.. పరిచయం అక్కర్లేని పేరు. ఆయన ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నన్నాళ్లూ జగన్ భజన చేసి తరించారు. జగన్ అడ్డగోలు నిర్ణయాలను, విధానాలనూ రాజును మించిన రాజభక్తి అన్న స్థాయిలో మద్దతు తెలిపి పునీతులయ్యారు. ఒక సమయంలో ఆయన బీజేపీ అధిష్ఠానానికి రాసిన లేఖలో అప్పట్లో రాష్ట్రంలో విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు కారణంగా ఏపీలో బీజేపీ పరిస్థితి నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్నట్లుగా తయారైందని పేర్కొన్నారు. ఆయన ఆ లేఖ రాసిన సమయంలో తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అధికారంలో లేదు.. అధికారంలో ఉన్న వైసీపీతో సోము వీర్రాజు అంటకాగుతున్నారు. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. ఆ హోదాలో ఉన్న ఆయన రాష్ట్ర పార్టీ బలహీనం కావడానికి విపక్ష నేత కారణం అంటూ అధిష్ఠానానికి లేఖ రాయడాన్ని బీజేపీ శ్రేణులే తప్పుపట్టాయి. అదొక్కటే కాదు.. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నంత కాలం ఆయన టార్గెట్ తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నట్లుగా విమర్శలతో చెలరేగిపోయారు. జగన్ కు వంత పాడటం కోసం ఆయన ఒంటెత్తు పోకడలకు పోయారు. అప్పట్లో ఆయన తీరును సొంత పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులే జీర్ణించుకోలేకపోయారు. రాష్ట్రంలో అంతంత మాత్రంగానే ఉన్న బీజేపీని కనీసం ఉనికి మాత్రంగా కూడా లేకుండా చేయడమే లక్ష్యమా అన్నట్లుగా అప్పట్లో సోము వీర్రాజు తీరు ఉండేది. సోము వీర్రాజు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీజేపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రం నుంచి ఒక ప్రతినిధి వర్గం హస్తినకు వెళ్లి మరీ సోము వీర్రాజుపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసింది. దానిపై సీరియస్ గా స్పందించిన బీజేపీ హైకమాండ్ వెంటనే పార్టీ రాష్ట్ర వ్యవహారల ఇన్ చార్జ్, అప్పటి కేంద్ర మంత్రి మురళీధరన్ ను రాష్ట్రానికి పంపింది. ఆయన నేరుగా రాజమహేంద్ర వరం వచ్చి పార్టీ నేతలతో బేటీ అయ్యారు. ఈ భేటీలో కూడా సోము వీర్రాజుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అప్పట్లో ఏపీలో జగన్ ప్రభుత్వ అవినీతిపై చార్జిషీట్ దాఖలు చేయాలని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశించినా సోము వీర్రాజు నేతృత్వంలోని పార్టీ రాష్ట్ర శాఖ ఆ పని చేయలేదు. ఇదంతా ఎందుకుంటే సోము వీర్రాజు ఎంతగా జగన్ భజనలో తరించారో చెప్పడానికే. అటువంటి సోము వీర్రాజు ఇప్పుడు స్వరం మార్చేశారు. చంద్రబాబు భజనకు రెడీ అయిపోయారు. తిరుమలలో స్వచ్ఛమైన లడ్డు తయారు చేసి భక్తులకు అందించే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చెప్పారు. అందుకు చంద్రబాబు తరఫున తానూ పూచీ అని వాకృచ్చారు. తిరుమల వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధోరణి హేయం అని విమర్శలు గుప్పించారు. జగన్ అధికారంలో ఉండగా మంచి చెడూ మరిచి ఆయనతో అంటకాగిని సోము వీర్రాజును ఇప్పుడు బీజేపీలో పట్టించుకునే నాథుడే లేరు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామే. ఏదో ఒక నామినేటెడ్ పోస్టు, కనీసం ఎమ్మెల్సీ అంటూ సోము వీర్రాజు వెంపర్లాడుతున్నా బీజేపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. దీంతో మళ్లీ పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడానికే సోము వీర్రాజు స్వరం మార్చారని బీజేపీ శ్రేణులే అంటున్నాయి. ఇక తెలుగుదేశం వర్గాలైతే సోము వీర్రాజును వీర లెవెల్లో ట్రోల్ చేస్తున్నాయి.

# సాత్ హిందూ ఐకాన్‌గా పవన్

**తిరుపతి :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాద తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అయిన విషయాన్ని చంద్రబాబు బయటపెట్టిన తర్వాత పవన్ కల్యాణ్‌లో సనాతన ధర్మ పరిరక్షణ రాజకీయాలు మేలుకున్నారు. డిప్యూటీ సీఎంగా అధికారం చేపట్టిన తర్వాత వంద రోజుల పాటు ఆయన ఎక్కడా పెద్దగా ప్రసంగించలేదు. కనీ వంద రోజుల తర్వాత లడ్డూ ఇష్యూ తర్వాత ఆయనలోని పాత రాజకీయనాయకుడు కనిపించాడు. సెక్యూలరిజం పేరుతో హిందూత్వాన్ని మాత్రమే విమర్శిస్తున్న వారికి.. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు రంగంలోకి దిగుతున్నట్లుగా సంకేతాలు పంపారు. వారాహి డిక్లరేషన్ కూడా ప్రకటించబోతున్నారు. ఇప్పుడు ఇదే అంశంపై తమిళనాడులోనూ ఆయన ఓ ఇంటర్వ్యూ ద్వారా పాపులర్ అయ్యారు. తమిళనాడులో పవన్ కల్యాణ్ అంత సుపరిచితుడు కాదు. ఆయన తెలుగులోనే సూపర్ స్టార్. తమిళవాసులకు పెద్దగా తెలియదు. మర తెలుగులో తమిళ హీరోలు ఎలా తెలుసో పవన్ కూడా అంతే. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అక్కడ రాజకీయాలంటే ఆసక్తి ఉన్న వారికి కూడా బాగా చిరపరిచితం అయ్యాడు. తమిళనాడులో భావజాలాలు, సిద్ధాంతాల మధ్య పోరాటమే రాజకీయంగా ఉంటుంది. అలాంటి సమయంలో పవన్ ప్రారంభిచిన సనాతన ధర్మ రక్షణ హాట్ టాపిక్ అయింది. అందుకే ఓ పాపులర్ టీవీ చానల్ ఆయనను దాదాపుగా గంటన్నర పాటు ఇంటర్వ్యూ చేసింది

. ఇందులో పవన్ కల్యాణ్ ప్రధానంగా తమిళ అంశాలు, హిందూత్వంపైనే మాట్లాడారు. తడబడకుండా తమిళ సంస్కృతిపై ఆయన చెప్పిన మాటలు.. అక్కడి ప్రజల్ని ఆకట్టుకున్నాయి. పవన్ కల్యాణ్ చెన్నైలోనే పెరిగారు. సోదరుడు చిరంజీవి హీరోగా మంచి పీక్ స్టేజ్ లో ఉన్నప్పుడు చెన్నైలోనే గడిపారు. అందుకే ఆయనకు తమిళం అనర్గళంగా వచ్చు. తెలుగు ఇండస్ట్రీ హైదరాబాద్ వచ్చేసిన తర్వాత చెన్నైతో అనుబంధం తగ్గిపోయింది కానీ.. భాషను మాత్రం ఆయన మర్చిపోలేదు. తమిళ టెక్నిషియన్లతో ఇప్పటికీ పని చేస్తూంటారు. తమిళంలో ఆయన ఇచ్చిన సమాధానాలు ప్రజల్ని ఫిదా చేశాయి. పవన్ కల్యాణ్ పై అక్కడి ప్రజల్లో ఇప్పటి వరకూ ఉన్న ఇమేజ్ ను పూర్తిగా మార్చేశాయన్న అభిప్రాయాలను తమిళనాడు వాసులు సోషల్ మీడియాలో వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాది హిందూత్వ ఫేస్ గా పవన్ కల్యాణ్ ఎదుగుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అందకే వారాహి డిక్లరేషన్ ను ఆయన ప్రకటించబోతున్నారు. అందులో ఖచ్చితంగా మరింత ఎక్కువగా సనాతన ధర్మం కోసం తాను చేయబోయే కార్యక్రమాల్ని ప్రకటించే అవకాశం ఉంది. పవన్ రాజకీయం కోసం ఈ సనాతన ధర్మ రక్షణ పోరాటం చేయకపోవచ్చు కానీ.. ఆ పోరాటం చుట్టూ రాజకీయం అయితే ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉంది. తమిళనాడులోనూ ఆయన ఇప్పు?డు వైరల్ గా మారారు. వచ్చే కొద్ది రోజుల్లో ఆయన కర్ణాటక,కేరళల్లోనూ పర్యటించినా ఆశ్చర్యం లేదు. మొత్తంగా పవన్ రాజకీయం మాత్రం వ్యూహాత్మకంగా సాగుతోందని అనుకోవచ్చు.


# ఈషా ఫౌండేషన్‌లో ఏం జరుగుతోంది

తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ లకు వచ్చేయడంతో సంచలనంగా మారింది. ఇటీవల సద్గురు వాసుదేవ్ పై చెన్నై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. " జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేశారు. జీవితంలో బాగా స్థిరపడేలా సంపాదించారు. కానీ ఇతర మహిళల తమ భౌతిక జీవితాన్ని త్యాగం చేయాలని చెబుతున్నారు. ఇలా ఆయన ఎందుకు చేస్తున్నారు" జగ్గీ వాసుదేవ్ ను ఉద్దేశించి తమిళనాడు హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇవి. జగ్గీ వాసుదేవ్ మనదేశంలో గాడ్ మ్యాన్ స్టేటస్ అనుభవిస్తున్నాడు. అలాంటి వ్యక్తిపై హైకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఒకరకంగా సంచలనమే అని చెప్పాలి. జగ్గీ వాసుదేవ్ ఇద్దరు మహిళలను నిర్బంధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దానిపై చెన్నై హైకోర్టులో విచారణ జరుగుతుంది. ఈ విచారణ క్రమంలోనే హైకోర్టు వాసుదేవ్ పై సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ సమయంలో పోలీసులు ఈశా ఫౌండేషన్ కార్యాలయంలో తనిఖీలు మొదలుపెట్టారు.. వాస్తవానికి వాసుదేవ్ వివాదాలు ఎదుర్కోవడం కొత్త కాదు. ఆయన భార్య మరణించిన తీరు ఇప్పటికీ ఒక వివాదంగానే ఉంది. పర్యావరణం గురించి పదే పదే చెప్పే జగ్గీ వాసుదేవ్.. పర్యావరణ నిబంధనలు పట్టించుకోకుండానే ఈషా ఫౌండేషన్ భవనాలను నిర్మించాడనే విమర్శలు ఉన్నాయి. ఇక ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో కొంతమంది మహిళలు అపహరణకు గురయ్యారని స్వయంగా తమిళనాడు పోలీసులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన సంఘటనలో చాలా ఉన్నాయి. 2022లో జగ్గీ వాసుదేవ్ సేవ్ సాయిల్ అనే నినాదంతో 27 దేశాల్లో 30 వేల కిలోమీటర్ల యాత్ర చేశారు. భారతదేశానికి తిరిగివచ్చారు. ఓ ప్రైవేట్ ఛానల్ ఆయనను ఇంటర్వ్యూ చేసింది. సేవ్ సాయిల్ పేరుతో మీరు చేస్తున్న యాత్ర బాగుందని చెప్పిన ఆ టీవీ ఛానల్.. ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండానే మీరు ఈషా ఫౌండేషన్ భవనాలు ఎందుకు నిర్మించాలని ప్రశ్నించింది. ఆ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పకపోగా.. దేశంలో చట్టాలు లేవా అంటూ వ్యాఖ్యానించారు. అనంతరం ఆ టీవీ ఛానల్ విలేఖరి మరో ప్రశ్న వేయగా.. ష్ అంటూ సద్గురు చిరాకును వ్యక్తం చేశారు. ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో ఆరుగురు మహిళలు అదృశ్యం అయ్యారట. 2016 తర్వాత ఆ మహిళను కనిపించడం లేదని తమిళనాడు పోలీసులు హైకోర్టుకు విన్నవించారు. గత ఏడాది మార్చిలో తన సోదరుడు 46 సంవత్సరాల గణేషన్ ఈషా ఫౌండేషన్ కార్యాలయం నుంచి కనిపించకుండా వెళ్లాడని తిరుమలై అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఆదేశాలతో పోలీసులు విచారణ నిర్వహించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జగ్గీ వాసుదేవ్ తన యూట్యూబ్ వీడియోల ద్వారా రకరకాల విషయాలను చెబుతుంటారు. ఇటీవల గ్రహణానికి సంబంధించి ఒక విషయాన్ని వెల్లడించారు. చంద్రగ్రహణం సమయంలో ఆహారం కలుషితమవుతుందని ఆయన చెప్పడం సంచలనంగా మారింది. జగ్గీ వాసుదేవ్ భార్యా మరణం విషయంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. వాసుదేవ్ భార్య 997 జనవరి 23న చనిపోయారు. అయితే ఆయన తన భార్య మరణాన్ని మహా సమాధిగా పేర్కొన్నారు. మహా సమాధి అంటే ఒక వ్యక్తి తనకు తానుగా శరీరాన్ని విడిచిపెట్టే విధానం. అయితే మన దేశంలో మహా సమాధి పొందిన వ్యక్తిని ఎవరూ దానం చేయలేదు. ఒకవేళ మహా సమాధి ఒక వ్యక్తి పొందితే.. ఆ వ్యక్తిని సమాధి మాత్రమే చేస్తారు.. గతంలో కల్కి భగవాన్ ఆశ్రమంలోనూ ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. అప్పట్లో ఆశ్రమంలో ఉన్నవారు పోలీసులు తనిఖీలు చేసినప్పుడు ఇలాంటి సమాధానాలు చెప్పారు. చూడబోతే ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలు సంచలనంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఫౌండేషన్ కార్యాలయంలో రకరకాల యోగాలు, ఇతర అభ్యసన ప్రక్రియల గురించి మాత్రమే చెబుతున్నారని అక్కడ ఉండే వారు అంటున్నారు. అయితే అక్కడ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయని కొంతమంది ఆరోపిస్తున్నారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో తమిళనాడు పోలీసులు అక్కడ సోదాలు చేస్తున్నారు. ఒకవేళ పోలీసులు అనుకున్నట్టుగా అక్కడ ఏదైనా దొరికితే.. జగ్గీ వాసుదేవ్ పై కచ్చితంగా చర్యలు ఉంటాయని ప్రచారం జరుగుతున్నది. అయితే సద్గురు తన భార్య కంటే భారతీ అనే మహిళతోనే ఎక్కువసేపు ఉండేవారట. ఈ విషయాన్ని అరుంధతి సుబ్రహ్మణ్యం అనే మహిళ సద్గురు మోర్ దెన్ లైఫ్ అనే పుస్తకంలో రాశారు. ఇక ఈషా ఫౌండేషన్ వెబ్ సైట్ లో అనేక వస్తువులను విక్రయిస్తుంటారు. అయితే అవి అత్యంత ఖరీదుగా ఉంటాయి. జగ్గీ వాసుదేవ్ పాదాల ఫోటో ఫ్రేమ్ 3200 అంటే.. ఆ వెబ్సైట్ ఆధారంగా ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అక్కడ ఒక రుద్రాక్ష ఖరీదు 10,000 దాకా ఉంటుంది. జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేశారు. కానీ చాలామంది యువతలను సన్యాసం తీసుకోవాలని ప్రోత్సహించారు.. ఇదే విషయాన్ని మద్రాస్ హైకోర్టు ప్రముఖంగా ప్రస్తావించింది..

# సారీ చెబితే నష్టం పూడ్చినట్టేనా

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధిక్రం లో ఉన్న విషయం మనకు తెలిసిందే. ఇక ఆ పార్టీ లో ఫారెస్ట్ మినిస్టర్ గా కొనసాగుతున్న కొండా సురేఖ రీసెంట్ గా సమంతను అక్కినేని ఫ్యామిలీ ని ఉద్దేశించి కొన్నిసభ్యకరమైన వ్యాఖ్యలు అయితే చేసింది. ఇక దానిమీద పలువురు సినిమా సెలబ్రిటీలు సైతం చాలా ఘాటు గా రియాక్ట్ అయ్యారు. ఆమె మాట్లాడిన దాంట్లో చాలా వరకు తప్పు ఉందని చెప్పడంతో వెంటనే ఆమె తను అలా మాట్లాడడం తప్పు అంటూ అక్కినేని ఫ్యామిలీకి సమంతకు సారీ చెప్పింది. ఇక్కడితో రచ్చ మొత్తం ముగిస్తుందని అందరు అనుకున్నారు. కానీ ఇప్పుడు సారీ చెప్పినంత మాత్రాన ఆమె మాట్లాడిన మాటలు గాని వాళ్ళ గురించి జనాల్లోకి వెళ్లిన న్యూస్ కానీ వెనక్కి తిరిగిరాదు కదా? అందుకే ఏదైనా మాట్లాడే ముందు ఇలాంటివి ఒకటికి రెండుసార్లు చూసుకుని మాట్లాడితే బాగుంటుంది అంటూ పలువురు సినీ సెలబ్రిటీలు కూడా ఆమె మీద తీవ్రంగా ఫైర్ అవుతున్నారు. నిజానికి సినిమా సెలబ్రిటీల మీద రాజకీయ నాయకులు తరచుగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. మరి వాళ్ళకి సినిమా ఇండస్ట్రీ అంటే ఎందుకు నచ్చదో ఎవరికి తెలియదు. ఇక మొత్తానికైతే వాళ్ళు చేసిన వాక్యాలు చిన్న సారీ తో సరిపెట్టుకునేవి అయితే కావు. దీనివల్ల ఎవరైతే కామెంట్స్ కి గురవుతారో వాళ్ళ కుటుంబాలు సఫర్ అవుతూ ఉంటాయి. అలాగే వాళ్ళ ఫ్యాన్స్ కూడా చాలా ఇబ్బందిని ఫేస్ చేస్తూ ఉంటారు. అందువల్లే ఒకసారి ఏదైనా మాట మాట్లాడేటప్పుడు ఒకటికి పది సార్లు ఆలోచించుకొని మాట్లాడితే బాగుంటుంది. మాట్లాడిన తర్వాత సారీ చెబితే జరిగిన నష్టాన్ని భర్తీ చేసే అవకాశం ఉండకపోవచ్చు. ఇక ఈ సంఘటన మీద కొండ సురేఖ సారీ చెప్పినప్పటికీ సమంత అభిమానులు గాని, అక్కినేని ఫాన్స్ గాని ఆమెను తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇక సగటు ప్రేక్షకుడు ఇలాంటి సంఘటనలు నిజంగానే జరిగాయా అని నమ్మే అవకాశాలు కూడా ఉన్నాయి. కాబట్టి జనం చేత ఎన్నుకోబడిన నాయకుడు జనాన్ని కాపాడాల్సింది పోయి ఇలాంటి చీప్ మాటలు మాట్లాడటం వల్ల వాళ్ల పరువును వాళ్ళు తీసుకోవడమే కాకుండా ఎదుటి వాళ్ళను కూడా ఇబ్బందుల్లోకి నెట్టిన వారవుతారు. ఇక ఇదిలా ఉంటే ఇప్పుడు జరుగుతున్న దాన్ని బట్టి చూస్తే ఆమె మీద అక్కినేని అభిమానులు సమంత అభిమానుల కోపం ఇంకా చల్లారినట్టుగా కనిపించడం లేదు. ఇక ఈ విషయం ఎక్కడి దాకా వెళుతుంది అనేది తెలియాలంటే మాత్రం మనం వేచి చూడాల్సిందే.

# నేడు అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం




ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 5వ తేదిన ఉపాధ్యాయులు విద్యార్థుల సమక్షంలో విద్యాలయాలలో వేడుకగా నిర్వహిస్తారు. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని 1994వ సంవత్సరం నుండి అక్టోబరు 5వ తేదిన జరుపుకుంటున్నారు. అంతర్జాతీయ విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 1966 సెప్టెంబర్ 21 నుండి 15 రోజుల పాటు పారిస్‌లో ఉపాధ్యాయుల పరిస్థితిపై ప్రత్యేకంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. అనేక దేశాలు, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ, వివిధ ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఆ సదస్సు ఉపాధ్యాయుల హోదా పెంచడానికి వారి హక్కులు, బాధ్యతలకు సంబంధించి కొన్ని నిర్దిష్ట సిఫారసులతో సమగ్రమైన పత్రాన్ని ఆమోదించింది. 'స్టేటస్ ఆఫ్ ది టీచర్స్' పత్రాన్ని ఆమోదించిన అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించి, సదరు సిఫార్సుల అమలును ప్రతియేటా సమీక్షించాలని నిర్ణయించింది. ఈ రోజున ఒక విద్యా సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు లేక పలు విద్యాసంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులు ఒకచోట సమావేశమై తమ భవిష్యత్ తరాలకు కావలసిన ఏర్పరుచుకోవాల్సిన పలు అంశాలపై చర్చిస్తారు. ఇందుకోసం తమ అందరి మద్దతుతో హామీలను పొందెందుకు సన్నద్ధమవుతారు. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవమునే కొన్ని దేశాలలో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

# షర్మిల సొంత అజెండాపై నేతల గుర్రు..

**విజయవాడ :** వైఎస్ షర్మిలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఉన్నాయా? ఉన్న కొద్దిపాటి మంది సీనియర్లు ఆమెను వ్యతిరేకిస్తున్నారా? ఆమెపై హై కమాండ్ కు ఫిర్యాదులు వెళుతున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. తెలంగాణలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరిట రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించారు షర్మిల. సుదీర్ఘకాలం తెలంగాణలో కూడా పాదయాత్ర చేశారు. కానీ అనుకున్న స్థాయిలో తెలంగాణ ప్రజల నుంచి స్పందన రాలేదు. దీంతో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు షర్మిల. అటు తరువాత కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. గతంలో తన సోదరుడు జగన్ కాంగ్రెస్ పార్టీని విభేదించి బయటకు వచ్చినప్పుడు ఆయనకు బాహటంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ పై విపరీతమైన వ్యాఖ్యలు చేశారు. కానీ అదే కాంగ్రెస్ పార్టీలో చేరి అందరి దృష్టిని ఆకర్షించారు. జగన్ దూకుడుకు కళ్లెం వేయాలని భావించిన కాంగ్రెస్ పార్టీ.. షర్మిలను ప్రయోగించింది. ఏపీ కాంగ్రెస్ పగ్గాలు అప్పగించింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న పరిమితమైన సీనియర్ నాయకులు ఆమె రాకను ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ బలుపేతానికి ఆమె కారణమవుతారని భావించారు. కానీ ఎన్నికల్లో కనీస స్థాయిలో కూడా కాంగ్రెస్ పార్టీ బలం పెరగలేదు. ఎన్నికల తరువాత కూడా ఆమె వైఖరి మారలేదు. సొంత అజెండాతో ముందుకెళ్లడంతో సీనియర్లు నేరుగా అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

షర్మిల నియామకం జగన్ కు ఇబ్బందికరంగా మారింది. కానీ కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. గతంలో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి ఎనలేని ఆదరణ ఉండేది. రాజశేఖర్ రెడ్డి మరణం, రాష్ట్ర విభజన, వైసిపి ఆవిర్భావంతో.. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో పలుచన అయ్యింది.
పార్టీ నుంచి గుంప గుత్తిగా నేతలు వైసీపీలో చేరిపోయారు. కాంగ్రెస్ ఓట్ బ్యాంక్ సైతం వైసీపీ వైపు టర్న్ అయ్యింది. అయితే షర్మిలకు బాధ్యతలు అప్పగించిన తర్వాత క్యాడర్ ఇటు వస్తుందని హై కమాండ్ భావించింది. అందుకే ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి నేతల ఆదరణ పెరిగింది. కొత్త ఓటింగ్ శాతం పెరుగుతుందని భావించి చాలామంది టికెట్లు ఆశించారు. ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ ఒక్కరంటే ఒక్కరు కూడా డిపాజిట్ దక్కించుకోలేదు. కడప పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన షర్మిల మూడో స్థానానికి పరిమితం అయ్యారు. అయితే కాంగ్రెస్ అసలు లక్ష్యం నెరవేరింది. ఏపీలో తనను దారుణంగా దెబ్బతీసిన జగన్‌అధికారానికి దూరం కావడం ఆ పార్టీకి ఉపశమనం కలిగించే విషయం. ఈ విషయంలో షర్మిలకు మంచి మార్కులు పడ్డాయి. జగన్ దారుణ పరాజయం వెనుక షర్మిల ఉన్నారన్నది ఒక ప్రధాన విశ్లేషణ. అయితే ఇప్పుడు ఎన్నికలు ముగిసి దాదాపు 6 నెలలు అవుతుంది. వైసీపీ అధికారానికి దూరమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఇంకా షర్మిల వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆమెను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన సీనియర్ నేత రఘువీరారెడ్డి ఏకంగా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఏపీలో షర్మిల వ్యక్తిగత అజెండా ఒక్కసారి పరిశీలించండి అన్నది ఆ ఫిర్యాదు సారాంశం. అయితే అంతకంటే ముందే టిక్కెట్ల కోసం డబ్బులు వసూలు చేశారని చాలామంది నేతలు ఫిర్యాదు చేశారు. ఇలా వరుస ఫిర్యాదులతో హై కమాండ్ సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమెను మార్చుతారా? లేకుంటే మందలిస్తారా? అన్నది చూడాలి.

# కాంగ్రెస్ ట్రాప్‌లో బీఆర్ఎస్...

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో బుధవారం మధ్యాహ్నం వరకూ హైడ్రా కూల్చివేతలు, మూసీ కూల్చివేతలపై చర్చే. కానీ కొండా సురేఖ ఎప్పుడు అయితే కేటీఆర్ ను కౌంటర్ చేయడానికి సిన ఫ్యామిలీస్ ను.. హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్‌ను తెరపైకి తెచ్చారో అప్పుడే సీన్ మారిపోయింది. బీఆర్ఎస్ నేతలంతా కొండా సురేఖపై విరుచుకుపడుతున్నారు. ఆమె వ్యక్తిగత ఆడియో రికార్డును పోస్టు చేస్తున్నారు. మహిళా నేతలు భారీ కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. కొండా సురేఖను డిఫెండ్ చేయడానికి కాంగ్రెస్ కూడా రెడీ అవుతోంది. ఇంటే రాజకీయం పూర్తిగా మారిపోయిందన్నమాట. మంత్రిగా ఉన్న కొండా సురేఖ అత్యంత సీనియర్ నేత. ఆమెకు రాజకీయాల్లో ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలుసు. ఫైర్ బ్రాండ్ నేతగా పేరుంది. ఆమె రాజకీయ విమర్శలు చేశారు కానీ ఎప్పుడూ వివాదాస్పదం కాలేదు. కానీ తొలి సారిగా ఆమె కేటీఆర్ ఇష్యూలో నాగార్జున కుటుంబాన్ని, హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ను తీసుకు వచ్చారు. మామూలుగా ఆరోపణలు చేస్తే.. పెద్దగా ఎఫెక్ట్ ఉండదేమో కానీ.. ఆమె చెప్పిన విధానం బీఆర్ఎస్ నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తుంది. చాలా విడమర్చి చెప్పారు. ఆమ చేసిన వ్యాఖ్యలు క్షణాల్లోనే వైరల్ అయిపోయాయి. అలాంటి గాసిప్స్ సోషల్ మీడియాలో ఇప్పటికే చెప్పుకుంటూ ఉండటంతో ఇక వాటికి తిరుగులేకుండా పోయిది. కానీ కొండా సురేఖ చేసింది కరెక్ట్ కాదన్న వాదన ఎక్కువగా వినిపిస్తోంది. అయితే ఆమె కావాలనే ఆ వ్యాఖ్యలు చేశారని కోరుకున్న ఎఫెక్ట్ వచ్చేందుకే అలా మాట్లాడారని అంటున్నారు.

బీఆర్ఎస్ మహిళా నేతలు కొండా సురేఖపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కొండా సురేఖతో మరో మహిళ మాట్లాడిన ఆడియో టేపును వైరల్ చేస్తున్నారు. కొండా సురేఖపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ నేతలపై రివర్స్ ఎటాక్ చేస్తున్నారు. ఇది అంతటితో ఆగిపోదని ముందు ముందు మరికొన్ని మాటల మంటలు, వీడియోలు, ఆడియోలు లీక్ అవుతాయన్న ప్రచారాన్ని మైండ్ గేమ్ మాదిరిగా రెండు పార్టీల నేతలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడల్లా ఈ టాపిక్ కు అంతం పడే అవకాశం లేదు. అంటే హైడ్రా కూల్చివేతలు.. మూసి నది సుందరీకరణ ఇలా అన్ని వెనక్కి పోతాయన్నమాట. ఈ రాజకీయాలు ప్రజల్లో ఓట్ల పరంగా సృష్టించే ఇంపాక్ట్ ఎంత ఉంటుందో కానీ.. వివాదం సద్దమణిగిన తర్వాత వేగంగా మర్చిపోతారు ప్రజలు. ఎందుకంటే వారి జీవితాల్లో ఈ రాజకీయ వివాదానికి ప్రాధాన్యత ఉండదు. హైడ్రా, మూసి కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టగలిగామని ప్రజా వ్యతిరేకత పెంచగలిగామని బీఆర్ఎస్ అనుకుంటోంది. ఇలాంటి సమంయలో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో ఒక్క సారిగా సీన్ మారిపోయింది. ఇప్పుడు బీఆర్ఎస్ టాపిక్ డైవర్ట్ కాకుండా అసలు అంశాన్ని లైవ్ లో ఉంచుకునేందుకు వ్యూహాత్మక రాజకీయం చేయాల్సి ఉంది. కానీ కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సినిమా తారలతో ముడిపడి ఉన్నాయి కాబట్టి.. వాటి వ్యాప్తిని ఆపేసి అసలు సమస్యను హైలెట్ చేయడం కత్తి మీద సాము లాంటిదే.

## అర్థరాత్రి రెండు గంటల వరకు పూజలు

**కాకినాడ** కాకినాడ జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. మొదటి రోజు అర్ధరాత్రి రెండు గంటల వరకు పూజలు జరిగాయి .రెండో రోజు శుక్రవారం తెల్లవారుజాము నుంచి తిరిగి భక్తులు ఆలయాలకు చేరుకుంటున్నారు. నవరాత్రులలో అమ్మవారికి ప్రీతికరమైనది శుక్రవారం, మూలా నక్షత్రం. రెండో రోజే శుక్రవారం రావడంతో ఆలయాలకు వస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతోంది. ప్రజాప్రతినిధులు దర్శనాలు చేసుకుంటున్నారు. పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుదీర్ పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది..

## పిడుగుపాటుకు ముగ్గురు మృతి

**కడప** పిడుగుపడి ముగ్గురు మృతి చెందారు. పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు గ్రామ పొలాలలో ఘటన జరిగింది. పిడుగుపాటుకు మహిళతో పాటు అబ్బాయి ఒక యువకుడు మృతి చెందారు. మృతులు శివపార్వతి (30) తేజేశ్వర్ రెడ్డి (10) మారుతి ప్రసాద్ రెడ్డి (30) గా గుర్తించారు. మృతులు వ్యవసాయ పనులు చేసుకుంటుండగా వర్షం పడుతుంటే చెట్టు కిందకు వెళ్లడంతో పిడుగుపాటుకు గురయ్యారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కొలికపూడికి షాక్ తప్పదా...

**విజయవాడ :** ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహార శైలి టిడిపికి తలనొప్పిగా మారుతోంది. అమరావతి ఉద్యమ నేపథ్యమున్న ఆయనకు పిలిచి మరి చంద్రబాబు టిక్కెట్ ఇచ్చారు. విజయవాడ ఎంపీగా పోటీ చేసిన కేశినేని చిన్నిసిఫారసు మేరకు కొలికపూడికి అవకాశం కల్పించారు. ఆయనకు టిడిపి అనుకూల మీడియాకు చెందిన ఓ అధిపతి ఆశీస్సులు ఉన్నట్లు కూడా అప్పట్లో ప్రచారం సాగింది. అయితే ఆయన దూకుడు ఎన్నికల నుంచే ఇబ్బందికర పరిస్థితులను తెచ్చిపెడుతోంది. కూటమి ప్రభంజనంలో తిరువూరు నుంచి గెలిచారు కొలికపూడి. కానీ గెలిచిన తర్వాత ఆయన తీరు మారింది. రోజుకో వివాదంలో చిక్కుకుంటున్నారు. పార్టీకి తలవంపులు తెస్తున్నారు. దీంతో కొలికపూడి విషయంలో ఏదో ఒకటి తేల్చుకోవాలన్న పరిస్థితికి టిడిపి హై కమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఆయనకు షాక్ ఇవ్వనున్నట్లు సమాచారం. ఓ సర్పంచ్ పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. అందుకు మనస్థాపానికి గురైన ఆయన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. డ్వాక్రా మహిళల విషయంలో సైతం అదే దూకుడు ప్రదర్శించారు. వారిని గంటల తరబడి పోలీస్ స్టేషన్లో ఉంచేలా ఆదేశాలు ఇచ్చారు. అటు తరువాత మహిళల నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు తాజాగా రైతులను టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ప్రత్యర్థులకు టార్గెట్ అవుతున్నాయి. ఆయన తీరుతో టిడిపి ప్రతిష్ట మొదలైంది. దీనికి తోడు దీక్షలు, ర్యాలీల పేరుతో కొలికపూడి హంగామా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. హై కమాండ్ కు ఫిర్యాదులు వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో అధిష్టానం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల తిరువూరు టిడిపి శ్రేణులు విజయవాడలో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందించాయి. మంత్రి అచ్చెనాయుడును కలిసి సమస్యలను విన్నవించాయి. దీంతో వారు చంద్రబాబుకు నివేదిక ఇచ్చారు. చంద్రబాబు ఎమ్మెల్యే కొలికపూడిని పిలిచి మాట్లాడారు. కీలక సూచనలు చేశారు. ఇటువంటివి మరోసారి పునరావృతం అయితే కఠిన చర్యలకు దిగుతామని హెచ్చరించారు. అయినా సరే ఆయనలో మార్పు రావడం లేదు. రోజురోజుకు పరిస్థితి శృతిమిస్తుండడంతో టిడిపి హై కమాండ్ ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురయింది. తాజా వివాదాల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ తిరువూరు ఇన్చార్జిగా సీనియర్ నేత శావల దేవదత్ ను నియమిస్తారని ప్రచారం ప్రారంభమైంది. రేపటి నుంచి నియోజకవర్గ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటానని ఆయన ప్రత్యేక ప్రకటన జారీ చేశారు. ఈరోజు మీడియా సమావేశాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నారు.

దీంతో దేవదత్ కు హై కమాండ్ సమాచారం ఇచ్చి ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. ప్రోటోకాల్ పదవి ఇచ్చి నియోజకవర్గం బాధ్యతలు చూడాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. ఇప్పటికే అధికార వర్గాలకు సైతం ప్రభుత్వం నుంచి ఒక సమాచారం వచ్చిందని.. ఇకనుంచి దేవదత్ ఆదేశాలను పాటించాలన్నదే ఆ సమాచార సారాంశం. అదే జరిగితే ఎమ్మెల్యే కొలికపూడిడమ్మీగా మారడం ఖాయమన్న ప్రచారం నడుస్తోంది. ఒక ఎమ్మెల్యేగా ఉండగా ఇంచార్జ్ రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. అయితే ఉద్యమ నేపథ్యం ఉన్న కొలికపూడి ఈ చర్యలకు ఊరుకుంటారా అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఒకవేళ ఆయన తోక జాడిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఖాయమన్న టాక్ నడుస్తోంది.

# వంగవీటి పొలిటికల్ లైఫ్ టర్న్ కాబోతోందా..

**విజయవాడ :** :వంగవీటి మోహన్ రంగ రాజకీయ వారసుడిగా తెరపైకి వచ్చారు రాధాకృష్ణ. కానీ సరైన రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన ఫెయిల్ అయ్యారు. అందుకే సుదీర్ఘకాలం పవర్ పాలిటిక్స్ కు దూరమయ్యారు. అయితే గత అనుభవాలను గుణపాఠాలుగా మార్చుకొని రాజకీయాలు చేశారు. ఈ ఎన్నికల్లో టిడిపి కూటమి గెలుపునకు కృషి చేశారు. ఎన్ని రకాల ఒత్తిళ్లు ఎదురైనా టిడిపిలోనే కొనసాగారు. ఇప్పుడు అదే రాధాకృష్ణ గుర్తింపునకు కారణమైంది. ఆయనకు త్వరలో పదవి వచ్చే అవకాశం కనిపిస్తోంది. చంద్రబాబు రాధాకృష్ణకు తగు రీతిలో గౌరవిస్తారని.. ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇస్తారని ప్రచారం నడిచింది. ఇప్పుడు ఆ అవసరం వచ్చింది. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరును టిడిపి హై కమాండ్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. తొలుత టిడిపి అభ్యర్థిగా మాజీమంత్రి ఆలపాటి రాజాను ఎంపిక చేసినట్లు ప్రచారం సాగింది. అయితే వైసిపి ఈ సీటు విషయంలో ప్రతిష్టాత్మకంగా ఉండడంతో.. వంగవీటి రాధా పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయంతో వైసిపి ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దాని నుంచి బయట పడాలంటే సరైన విజయం దక్కాలని భావిస్తోంది. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. వైసీపీ అభ్యర్థిగా గౌతమ్ రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన వైయస్ కుటుంబానికి సమీప బంధువు. ఆపై బలమైన ఆర్థిక నేపథ్యం ఉంది. ఆయనను ఢీకొట్టాలంటే వంగవీటి రాధాకృష్ణ అయితే సరైన అభ్యర్థి అవుతారని టాక్ నడుస్తోంది. వంగవీటి రాధాకృష్ణ వైసీపీని వీడడానికి గౌతమ్ రెడ్డి ఒక కారణం. విజయవాడ రాజకీయాల్లో గౌతంరెడ్డి దూకుడుగా ఉంటారు. కార్మిక సంఘాల్లో మంచి పట్టు ఉంది. వైసీపీ ఆవిర్భావం నుంచి రాధాకృష్ణ జగన్ వెంట నడిచారు. అయితే గౌతమ్ రెడ్డి విజయవాడ రాజకీయాల్లో ఎంటర్ అయ్యేసరికి సీన్ మారింది. గౌతం రెడ్డికి రాధాకృష్ణతో విభేదాలు ఎదురయ్యాయి. అవే వంగవీటి మోహన్ రంగ పై గౌతమ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు కారణమయ్యాయి. అయితే అప్పట్లో కనీసం గౌతమ్ రెడ్డిని మందలించలేదు జగన్. అది రాధాకృష్ణకు నచ్చలేదు. పైగా నచ్చిన సీటు నుంచి తప్పించడంతో రాధాకృష్ణ టిడిపి వైపు వచ్చారు. ఒక విధంగా చెప్పాలంటే గౌతంరెడ్డి వల్లనే రాధాకృష్ణ పార్టీ మారారు. ఇప్పుడు అదే గౌతమ్ రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మారడంతో.. వంగవీటి రాధాకృష్ణను చంద్రబాబు ప్రయోగిస్తారని ప్రచారం నడుస్తోంది. 2004లో తొలిసారిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు రాధాకృష్ణ. తండ్రి మోహన్ రంగ మరణం సమయానికి ఆయన బాలుడు. అయితే 2003లో వైయస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేశారు. ఆ సమయంలో రాధాకృష్ణను చూసి రాజకీయాల్లోకి ఆహ్వానించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచారు రాధాకృష్ణ. అయితే 2009 ఎన్నికల నాటికి ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. జగన్ పిలుపుమేరకు వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. దీంతో టీడీపీలోకి వచ్చారు. ఇప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ రూపంలో రాధాకృష్ణకు ఛాన్స్ దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. సో రాధాకృష్ణ పొలిటికల్ లైఫ్ టర్న్ అయ్యే ఉందన్నమాట.

# విధుల్లోకి స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు

**విశాఖపట్టణం :** విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు విజయం సాధించారు. యాజమాన్యం కార్మికుల ఒత్తడికి దిగొచ్చింది. కాంట్రాక్టు కార్మికులను తిరిగి కొనసాగించేందుకు అంగీకరించింది. ఈ మేరకు లేబర్ కమిషనర్ సమక్షంలో ఒప్పందం జరిగింది. సెప్టెంబర్ లో4,200 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తెలిగించాలని నిర్ణయించిన యాజమాన్యం ఇప్పుడు తిరిగి వారిని విధుల్లోకి తీసుకుంది. కార్మికుల విజయం ఐక్యంగా పోరాడిన విశాఖ ఉక్కు కార్మికులు కీలక విజయం సాధించారు. ప్రైవేటీకరణలో భాగంగా కాంట్రాక్టు కార్మికులను భారీగా తగ్గించడానికి యాజమాన్యం చేసిన కుట్రను అడ్డుకున్నారు. కార్మికుల ఆందోళన మరింత తీవ్రమయ్యే సంకేతాలు కనిపించడంతో యాజమాన్యం దిగివచ్చింది. కార్మిక సంఘాలతో చర్చలకు సిద్ధపడింది. అందరినీ విధుల్లో కొనసాగిస్తామని లేబర్ కమిషనర్ సమక్షంలో రాతపూర్వకంగా ఒప్పుకుంది. దీంతో కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇదే స్ఫూర్తితో ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, సెయిల్‌లో విలీనాన్ని సాధిస్తామని కార్మికసంఘాలు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రకటించాయి. కార్మికుల ఆందోళనలు పెద్దఎత్తున జరుగుతుండటంతో కార్మిక సంఘాలను యాజమాన్యం చర్చలకు పిలవక తప్పనిస్థితి ఏర్పడింది. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ లేబర్ కమిషనర్ సమక్షంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి, కాంట్రాక్టు కార్మిక సంఘాలకు మధ్య సుదీర్ఘ చర్చలు నడిచాయి. చివరకు దిగివచ్చిన యాజమాన్యం ప్రస్తుతానికి కాంట్రాక్టు కార్మికులను ఎవరినీ తొలగించబోమని, ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో తొలగించిన 3700 మంది కాంట్రాక్టు కార్మికుల లేబర్ పాస్‌లను తిరిగి పునరుద్ధరిస్తామని, అలాగే సిస్టంలో బయోమెట్రిక్ డేటాబేస్‌ను కూడా పునరుద్ధరిస్తామని చెప్పింది. పాత పద్ధతిలోనే గేట్ పాస్‌లను కొనసాగించడానికి అంగీకరించింది. కార్మికులకు హామీ ఏడు రోజులలో అన్‌లైన్‌లో పునరుద్ధరణ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపింది. ఈ చర్చల సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ ఎవరికి అన్యాయం జరిగినా ఊరుకోబోమన్నారు. లేబర్ కమిషనర్ మహంతి మాట్లాడుతూ కార్మికుల ఉపాధి పరిరక్షణ, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంపుదల వంటి అంశాలపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంతగనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ విధానాలు మానుకోకపోతే తెలుగోడి సత్తా చూపుతామని కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాల జెఎసి చేపట్టిన దీక్షల్లో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు కొనసాగాయి.

# సంక్రాంతి మరో పథకం

**విజయవాడ :** ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువు దీరి నాలుగు నెలలు అవుతోంది. ఒక్కో పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల మొత్తాన్ని పెంచి అందించింది. గత నాలుగు నెలలుగా విజయవంతంగా అందించగలిగింది. అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టనుంది. డీఎస్సీ నోటిఫికేషన్ ప్రక్రియ పై కసరత్తు జరుగుతుంది. అందుకు సంబంధించి ఫైల్ పై ఎప్పటికీ సీఎం చంద్రబాబు సంతకం చేశారు. మరోవైపు సంక్రాంతికి మరో కొత్త పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. పి4 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాలు తరహాలో స్వచ్ఛ సేవకుల కోసం ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టనున్నారు. అలాగే డ్వాక్రా సంఘాలకు త్వరలో మైక్రోస్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ హోదా కల్పించడానికి కూడా సిద్ధపడుతున్నారు. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు 10 లక్షల రూపాయల రుణాలు ఇస్తున్నారు. వ్యక్తిగత రుణాల పరిమితిని రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచారు. ఇప్పుడు డ్వాక్రా సంఘాల మాదిరిగానే స్వచ్ఛ సేవకుల కోసం ప్రభుత్వం ఆలోచన చేస్తుండడం విశేషం. వాస్తవానికి డ్వాక్రా సంఘాల ఏర్పాటు ఆలోచన చంద్రబాబుదే. 1999లో అధికారంలోకి వచ్చారు చంద్రబాబు. దీంతో మహిళల కోసం స్వయం ఉపాధి పథకాలు పెంచాలని భావించారు. అందులో భాగంగా పురుడు పోసుకున్నది డ్వాక్రా వ్యవస్థ. దేశంలోనే ఆదర్శంగా నిలిచింది వ్యవస్థ. ఏపీ ని చూసి చాలా రాష్ట్రాలు డ్వాక్రా వ్యవస్థను ప్రవేశపెట్టాయి. ఇప్పుడు తాజాగా చంద్రబాబు సర్కార్ స్వచ్ఛ సేవకుల వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. చంద్రబాబుకి నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం. 1995లో తొలిసారిగా సీఎం అయ్యారు చంద్రబాబు. అప్పటినుంచి మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. మహిళల అభిమానాన్ని చురగొన్నారు. 1999 ఎన్నికల్లో మహిళలు అండగా నిలవడం వల్లే చంద్రబాబు అధికారంలోకి రాగలిగారన్నది విశ్లేషకులు అభిప్రాయం. అయితే 2004,2009 ఎన్నికల్లో మహిళలు ఆదరించకపోవడం వల్లే చంద్రబాబు ఓడిపోయారు. అందుకే చంద్రబాబు మహిళలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టడంతో 2014లో తిరిగి అధికారంలోకి వచ్చారు. ఈ ఎన్నికల్లో సైతం మహిళల కోసం అనేక పథకాలు ప్రకటించారు చంద్రబాబు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు అగ్రతాంబూలం ఇచ్చారు. తల్లికి వందనం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అందులో భాగమే. అయితే తాను మహిళా పక్షపాతి అని చాలా సందర్భాల్లో చంద్రబాబు చెప్పుకొచ్చారు. దీనిని ఇప్పుడు నిజం చేసే పనిలో పడ్డారు. అందుకే డ్వాక్రాసంఘాల కుటుంబాల కోసం స్వచ్ఛ సేవకుల వ్యవస్థను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. సంక్రాంతి నుంచి ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుండడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఫైట్ షూరూ చేసిన జగన్....

**విజయవాడ :** వైసీపీ అధినేత దూకుడు పెంచారు. కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. వైసీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత అంతర్గత సమావేశాలకు జగన్ పరిమితం అయ్యారు. కానీ ఇప్పుడు యాక్టివ్ అయ్యారు. పార్టీ అనుబంధ సంఘాలతో ఇంట్రాక్టివ్ అవుతున్నారు. వారితో మమేకం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిలో ధైర్యం నూరిపోసి కూటమి ప్రభుత్వంపై పోరాడేలా సంసిద్ధులుగా చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో వైసిపి ఘోరంగా ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశలో కూరుకుపోయాయి. పార్టీకి భవిష్యత్తు లేదని భావించిన నేతలంతా గుడ్ బై చెబుతున్నారు. మరికొందరు పార్టీ నుంచి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. సీనియర్లు సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పార్టీ కార్యక్రమాలకు సైతం హాజరు కావడం లేదు. పరిస్థితి చూసి నిర్ణయం తీసుకుందామని చాలామంది భావిస్తున్నారు. కూటమి పార్టీల నుంచి ఆహ్వానం లేకపోయినా.. చాలామంది వైసీపీ నుంచి బయటకు వెళ్ళిపోతున్నారు. రాజకీయంగా స్తబ్దుగా ఉన్నారు. ఇటువంటి తరుణంలో జగన్ అలర్ట్ అయ్యారు. పార్టీ శ్రేణులతో మమేకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు అవుతోంది. ఇప్పుడిప్పుడే వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెబుతున్నారు. జగన్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపిస్తున్నారు. అయితే దీనిని తిప్పి కొడుతున్నారు జగన్. జగన్ అనేవాడు సీఎం సీట్ లో ఉంటే సంక్షేమ పథకాలు కొనసాగేవని.. ప్రజలకు మంచి జరిగేదని గుర్తు చేశారు. అమ్మ ఒడి ఆగింది.. ఫీజు రీయింబర్స్మెంట్ ఆగింది.?

రైతు భరోసా ఆగింది ఆరోగ్య శ్రీ ఆగింది.. ఇలా అన్ని పథకాలు మూలకు చేరాయని చెబుతున్నారు జగన్. అబద్ధాలు, మోసాలతో కాలం కరిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తన హయాంలో అమలైన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తున్నారు. నాలుగు నెలల కూటమి పాలన దారుణంగా ఫెయిల్ అయిందని చెప్పుకొస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఉన్నవారే తనవారని.. వెళ్లిపోయిన వారు తన వారు కాదని గుర్తు చేస్తున్నారు జగన్. 2029 నాటికి వైసిపికి పూర్వ వైభవం ఖాయమని తేల్చి చెబుతున్నారు. కష్టపడిన ప్రతి ఒక్కరిని గుర్తించుకుంటానని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని పిలుపునిస్తున్నారు. పోరాడితే కేసులు తప్ప మరేం చేయలేరని కూడా తేల్చి చెబుతున్నారు. మీ వెంట నేనుంటానని భరోసా ఇస్తున్నారు. అనుబంధ విభాగాల ప్రతినిధులు, పార్టీ జిల్లా అధ్యక్షులకు కీలక ఆదేశాలు ఇచ్చారు జగన్. ఒకవైపు ప్రభుత్వ వైఫల్యాలు చెబుతూనే.. భవిష్యత్తులో అండగా నిలుస్తానని వారిలో ఒక రకమైన ధైర్యం నూరిపోస్తున్నారు. ప్రస్తుతం వైసీపీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఒకవైపు కేసులు, మరోవైపు పార్టీని వీడుతున్న నేతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. అయితే ఇదే నిర్ణయం కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తప్పవని జగన్ భావించారు. తొలి మూడు నెలలు అంతర్గత సమావేశాలకు పరిమితమైన జగన్..ఇప్పుడు పార్టీ శ్రేణులతో వరుసగా సమీక్షలు జరుపుతున్నారు. జిల్లాలో పార్టీ స్థితిగతులను తెలుసుకుంటున్నారు. సంక్రాంతి తరువాత ప్రజల్లోకి వస్తానని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం తప్పకుండా వైఫల్యం చెందుతుందని.. అందుకే పార్టీ శ్రేణులు పోరాటానికి సిద్ధంగా ఉండాలని.. భవిష్యత్తు మనదేనంటూ తేల్చి చెబుతున్నారు. మొత్తానికి అయితే వైసీపీ అధినేత కూటమి ప్రభుత్వంపై యుద్ధమే ప్రకటించారు. తన సైన్యాన్నిసర్వసిద్ధం చేస్తున్నారు. అయితే వైసీపీ శ్రేణులు ఎంతవరకు పోరాడుతాయో చూడాలి.

# లాయర్ ఖర్చు..ఎవరిది...

**తిరుమల :** తిరుమల లడ్డు వ్యవహారం యూటర్న్ తీసుకుంది. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. కోట్లాదిమంది భక్తుల మనోభావాల విషయంలో.. రాష్ట్ర సీఎం గా ఉన్న చంద్రబాబు బాధ్యత రాహిత్యంగా ప్రకటనలు చేస్తే ఎలా అని అర్థం వచ్చేలా తప్పు పట్టింది. ఆధారాలు లేకుండా, సెకండ్ ఒపీనియన్ తీసుకోకుండా ఎలా బయటకు వెల్లడిస్తారని ప్రశ్నించింది. టీటీడీ లడ్డు తయారీకి సంబంధించి..నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందని చంద్రబాబు ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశంలో ప్రస్తావించారు. అక్కడి నుంచి రచ్చ ప్రారంభమైంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే సిట్ విచారణ నిలిపివేయాలని, సీబీఐ దర్యాప్తు ఏర్పాటు చేయాలని వైసీపీ నేత వైవి సుబ్బారెడ్డి, బిజెపి మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం అయింది. అయితే టీటీడీ తరుపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్ర వాదించారు. బలమైన వాదనలు వినిపించారు. ఇఅయితే ఈ కేసులో సిద్ధార్థ లూథ్ర ఎంటర్ కావడం చర్చకు దారితీస్తోంది. గతంలో చంద్రబాబుపై అక్రమ కేసుల్లో వాదనలు వినిపించారు ఆయన. చంద్రబాబుపై అవినీతి కేసులు నమోదైన సంగతి తెలిసిందే. దాదాపు 52 రోజులు పాటు ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆ సమయంలో ఆయన ఏసీబీ కోర్టు నుంచి మళ్లీ సుప్రీంకోర్టు వరకు చంద్రబాబు తరపున వాదనలు వినిపించారు. చివరకు చంద్రబాబుకు బెయిల్ వచ్చేలా చేశారు. అయితే అప్పట్లో సిద్ధార్థ లూథ్ర పెద్ద చర్చకు దారి తీశారు. లూథ్ర సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ లాయర్. ఎన్నో కేసుల్లో విజయం సాధించారు. సక్సెస్ ఫుల్ లాయర్ కావడంతో నిత్యం బిజీగా ఉంటారు. ఒక్కో కేసు విచారణకు లక్షల్లో తీసుకుంటారని ప్రచారం ఉంది. గంటలకు లక్షలు తీసుకుంటారని కూడా టాక్ నడిచింది. దేశంలో ఏ కోర్టులనైనా వాదించేందుకు సిద్ధమని..ప్రత్యేక విమానాల్లో వచ్చి వాదించిన సందర్భాలు కూడా ఉన్నాయని ఎన్నో రకాల విశ్లేషణలు ఉన్నాయి. అటువంటి సిద్ధార్థ లూథ్ర ఇప్పుడు టిటిడి లడ్డు కేసులో వాదనలు వినిపించడం విశేషం. అప్పట్లో చంద్రబాబు టిడిపి అధినేత. ఓ రాజకీయ పార్టీ నాయకుడు. కచ్చితంగా టిడిపి లాయర్ ఖర్చులు అప్పట్లో భరించి ఉంటుంది. కానీ ఇప్పుడు టీటీడీ లడ్డు వివాదం కేసులో లూథ్ర వాదనలు వినిపిస్తున్నారు. అయితే ఆయనకు ఫీజు టీటీడీ చెల్లిస్తుందా?లేకుంటే ప్రభుత్వం చెల్లిస్తుందా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. లక్షలాది రూపాయలు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ఎవరు చెల్లిస్తారో?అన్నది మాత్రం బయటకు తెలియడం లేదు. టీటీడీ చెల్లిస్తే మాత్రం ప్రత్యర్థులకు ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.

# తమ్మినేని దారెటు...

**శ్రీకాకుళం :** పాలిటిక్స్ ఈజ్ ఆల్‌వేస్ ఇంట్రెస్టింగ్. పైగా పేరున్న నేత పదవిలో ఉన్నా లేకపోయినా హాట్ టాపికే. ఏపీలో అలాంటి కటౌటే తమ్మినేని సీతారాం. ఫైర్ బ్రాండ్‌గా..పదవి ఉన్నా.. లేకపోయినా..తనకంటూ ఓ సెపరేట్ స్టైల్ ఉంటుంది. ప్రత్యర్థులపై మాటల తూటాలతో విరుచుకుపడుతుంటారు. అలాంటి సీనియర్ నేతకు ఇప్పుడు కొత్త కష్టం వచ్చి పడిందట. దశాబ్దాలుగా తను కంచుకోటగా తయారు చేసుకున్న నియోజకవర్గం చేజారిపోతుందన్న భయం వెంటాడుతోందట. ఐదుసార్లు ఎమ్మెల్యేగా..మంత్రిగా, ఏపీ శాసనసభాపతిగా..పనిచేశారు తమ్మినేని సీతారాం. మూడు దశాబ్దాలుగా ఆమదాలవలస నియోజకవర్గాన్ని తన అడ్డాగా మార్చుకున్నారు. అయితే ఆయన 2019లో ఎమ్మెల్యేగా గెలిచి స్పీకర్ అయిన తర్వాత ఆమదాలవలస నియోజకవర్గంలో పరిస్థితులు మారుతూ వచ్చాయి. స్వపక్షంలోనే విపక్షం తయారైంది. సీతారాం గెలుపు కోసం కష్టపడ్డ నేతలే ఆయనపై తిరుగుబాటు చేశారు. సువ్వారిగాంధీ లాంటి సీనియర్ నేత.. ఏకంగా తమ్మినేని సీతారాంపై రెబల్‌గా పోటీ చేశారు. నియోజకవర్గంలో సొంత పార్టీలో వ్యతిరేకతకు తమ్మినేని కుటుంబ సభ్యులే కారణమన్న టాక్ జిల్లాలో గట్టిగా వినిస్తోంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లా ముఖ్యనేతలతో వైసీపీ అధినేత జగన్ సమావేశం అయ్యారు. ఆ మీటింగ్ తర్వాత తమ్మినేని సీతారాంకు శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. తమ్మినేనిని వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ బరిలో దించుతారని.. ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతలు కొత్త నాయకుడికి అప్పగించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోందంటూ వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తమ్మినేని సీతారాం కొడుకు చిరంజీవి నాగ్ ఆమదాలవలస రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నారు. అయితే అనేక మంది వైసీపీ ద్వితీయస్థాయి నేతలు చిరంజీవి నాగ్ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆమదాలవలసకు కొత్త నాయకుడు కావాలన్న చర్చ క్యాడర్‌లో గట్టిగానే నడుస్తోంది. వయస్సు రీత్యా తమ్మినేని వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అన్నది కూడా డౌట్. దీంతో తన కుమారుడ్ని ఎలాగైనా ఆమదాలవలస నుంచి బరిలో దించాలన్న ప్లాన్ చేస్తున్నారట.

స్థానిక నాయకుల నుంచి మాత్రం వ్యతిరేకత వ్యక్తం అవుతుండటంతో..తన వారసుడి రాజకీయ భవితవ్యంపై తెగ బెంగ పెట్టుకున్నారట. తాను నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉంటేనైనా కొడుకుకు టికెట్ కోసం ఫైట్ చేసే వాడినని.. తనను పార్లమెంట్ ఇంచార్జ్‌గా వేశారని బాధ పడుతున్నారట. మరి నియోజకవర్గంపై ఉన్న పట్టుతో కొడుకుకే ఇంచార్జ్ బాధ్యతలు వచ్చేలా లాబీయింగ్ చేస్తారా లేక..ఆమదాలవలస నియోజకవర్గానికి తమ్మినేని సీతారం గుడ్ బై చెబుతారో వెయిట్ చేయాల్సిందే

## వైసీపీ లీడర్లు బౌన్స్ బ్యాక్ అవుతున్నారా?

# చంద్రబాబే కారణమా?

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయింది. ఈ వంద రోజుల కాలంలో అనేక రాజకీయ పరిణామాలు జరిగాయి. అయితే దాదాపు మూడు నెలల నుంచి వైసీపీ నేతలు పార్టీకి దూరంగా ఉంటున్నారు. మీడియా సమావేశంలో అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి వారు మాత్రమే స్పందిస్తున్నారు తప్పించి మిగిలిన వారు మౌనంగానే ఉంటున్నారు. మరో వైపు అనేక మంది వైసీపీ నేతలు కేసులు ఎదుర్కొంటున్నారు. అందరూ నేతలు ముందస్తు బెయిల్ తెచ్చుకుని కొంత ఊరట పొందారు. కానీ తిరుమల లడ్డూ వివాదం తర్వాత వైసీపీ నేతలు అందరూ యాక్టివ్ అవుతున్నట్లే కనపడుతుంది. లడ్డూ వివాదాన్ని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు అనవసరంగా సాగదీయడంతో వైసీపీకి పెద్దయెత్తున డ్యామేజీ అవుతుందని భావించిన వైసీపీ నేతలు తిరిగి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించడానికి సిద్ధమవుతున్నట్లు కనపడుతుంది.

లడ్డూ వివాదాన్ని పెద్దది చేయకపోతే మరికొంత కాలం వైసీపీ నేతలు తమ వ్యాపారాలు, లేక రెస్ట్ మోడ్ లోనే ఉండేవారంటున్నారు. కానీ చంద్రబాబు లడ్డూ వివాదాన్ని లాగుతూ, పీకుతున్నందున తమకు వచ్చే ఎన్నికల్లో హిందూ ఓటు బ్యాంకు దూరమవుతుందని భావించి పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు అడుగులు వేస్తున్నారు. ఇన్నాళ్లు నియోజకవర్గాలకు దూరంగా ఉన్న నేతలు ఒక్కసారి ఫ్రేమ్ లో కనపడటంతో వైసీపీ క్యాడర్ లోనూ ఉత్సాహం కనిపిస్తుంది. వైసీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని వంటి వారు తిరిగి యాక్టివ్ కావడంతో ఇక మిగిలిన లీడర్లు కూడా వరసగా పార్టీలో చురుగ్గా పాల్గొంటారంటున్నారు. ఇది క్యాడర్ లో కొంత ధైర్యాన్ని ఇచ్చే అంశంగానే చెప్పాలి. కొడాలి నాని గుడివాడలో ఓడిపోవడమే అతని వర్గానికి షాకింగ్‌గా చెప్పాలి. ఎందుకంటే ఏ పార్టీ నుంచి అయినా ఏ గుర్తు మీద అయినా గెలిచి సత్తా చాటే కొడాలి నాని ఓటమిని క్యాడర్ కూడా జీర్ణించుకోలేకపోతున్నారు.

అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు మీద వ్యక్తిగత దూషణలు కూడా చేసింది ఆయనే. లోకేష్ ను కూడా అనేక సార్లు అనకూడని మాటలు అని టీడీపీకి ప్రధాన శత్రువుగా మారారు. వల్లభనేని వంశీ కూడా... ఇక వల్లభనేని వంశీ కూడా అంతే. గన్నవరం నియోజకవర్గంలో 2019లో టీడీపీ నుంచి గెలిచి వైసీపీకి మద్దతుదారిగా నిలిచారు. చంద్రబాబు కుటుంబాన్ని కూడా దూషించారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఇలా ఇద్దరు నేతలు ఒకే సామాజికవర్గానికి చెందిన నేతలు కావడంతో సహజంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారినే టార్గెట్ చేస్తుందని అందరూ భావించారు. ఇప్పుడు వందరోజుల దాటిన తర్వాత లడ్డూ వివాదం మరింత ముదురుతుండటంతో కీలక నేతలు ఎంట్రీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకా అనేక మంది వైసీపీ నేతలు రోడ్డు మీదకు వస్తున్నారంటూ వైసీపీ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు కనిపిస్తున్నాయి. మరి చూడాలి.. ఏంజరుగుతుందనేది

# తప్పని విద్యుత్ భారం

**తిరుపతి :** ఏపీలో విద్యుత్ ఛార్జీల పెంపుకు రంగం సిద్ధం అవుతోంది. డిస్కంలు తాజాగా విద్యుత్ ఛార్జీల పెంపు పైన ఈఆర్సీకి ప్రతిపాదనలు చేసాయి. దాదాపు రూ 8,113 కోట్ల మేర ప్రజల పైన భారం పడనుంది. అయితే, ఈ ప్రతిపాదనల్లో ప్రధానంగా గృహ విద్యుత్ వినియోగదారులపైనే అత్యధిక భారం పడనుంది. ఈఆర్సీ బహిరంగ విచారణ తరువాత పెంపు పైన నిర్ణయం తీసుకోనున్నారు. కసరత్తు రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపు పైన కసరత్తు జరుగుతోంది. 2022-23 సంవత్సరంలోనే ఇంధన కొనుగోలు వ్యత్యాసాల సర్దుపోటు భారం రూ.8,113 కోట్లు రాష్ట్ర ప్రజలపై పడబోతోంది. ఇందులో గృహ విద్యుత్ వినియోగదారులపైనే అత్యధిక భారం పడనుంది. ఇది సగటున యూనిట్‌కు రూ.1.27 చొప్పున ఉంటుందని సాక్షాత్తూ డిస్కంలూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి నివేదించాయి. ఈ మేరకు 2022 సెప్టెంబరు 29న ప్రతిపాదనలు సమర్పించాయి. సర్దుపోటు భారం రూ.8,113 కోట్లలో గృహ వినియోగదారులపై రూ.2191 కోట్లు, వాణిజ్య వినియోగదారులపై రూ.669 కోట్లు, వ్యవసాయంపై రూ.1,901 కోట్లు, పరిశ్రమలపై రూ.547 కోట్లు, ఇతరులపై రూ.55 కోట్లు ఉంటుందని ఇంధనశాఖ మంగళవారం అధికారికంగా వెల్లడించింది. ఈ నెల 18న ప్రజాభిప్రాయ సేకరణ జరిగాక.. సర్దుపోటుపై ఏపీఈఆర్సీ ఆదేశాలు జారీ చేస్తుందని డిస్కంలు చెబుతున్నాయి. 2022-23లో విద్యుత్ రంగం భారీ ఒడిదొడుకులు ఎదుర్కొన్నట్లు కమిషన్‌కు పంపిన ప్రతిపాదనల్లో ఆ సంస్థలు పేర్కొన్నాయి. కరోనా కారణంగా ఒక్కసారిగా విద్యుత్ డిమాండ్ పెరిగిందని తెలిపాయి. తుది నిర్ణయం ఈ డిమాండ్‌ను తట్టుకునేందుకు బయట నుంచి విద్యుత్‌ను స్వల్పవ్యవధి కింద కొనుగోలు చేసినట్లు వెల్లడించాయి. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.6,522 కోట్లతో 8,394 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేసినట్లు పేర్కొన్నాయి. కాగా.. డిస్కంలు రుణభారంతో విలవిలలాడుతున్నాయి. ఈ నెల 18న ప్రజాభిప్రాయం సేకరిస్తామని ప్రకటించాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 2023-24 సంవత్సరానికి గాను రూ.11,826.82 కోట్ల ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేసుకోవడానికి ఈఆర్సీని డిస్కంలు అనుమతి కోరాయి



## పండంటి బిడ్డకు జన్మనిచ్చిన
# హీరోయిన్ చిత్ర శుక్లా

టాలీవుడ్ స్టార్స్ చాలామంది ఇటీవల కాలంలో తల్లిదండ్రులయిన విషయం తెలిసిందే. నిన్న మొన్నటిదాకా వరుసగా టాలీవుడ్ లో పెళ్లి బాజాలు మోగగా, ఇప్పుడేమో వరుసగా పేరెంట్స్ అవుతూ వార్తల్లో నిలుస్తున్నారు పలువురు సెలబ్రిటీ కపుల్స్. తాజాగా తెలుగులో పలు సినిమాల్లో హీరోయిన్ గా నటించి మంచి గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ చిత్ర శుక్లా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అది కూడా కరెక్ట్ గా తన పెళ్లి ముహూర్తానికి గుడ్ న్యూస్ అందింది అంటూ సోషల్ మీడియా వేదికగా ఈ శుభవార్తను అభిమానులతో పంచుకుంది. హీరోయిన్ చిత్రా శుక్లా సోషల్ మీడియా వేదికగా తను పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది అన్న విషయాన్ని పోస్ట్ చేసింది. నాలుగు రోజుల క్రితమే అంటే సెప్టెంబర్ 30న రాత్రి 9:31 తనకు బిడ్డ పుట్టాడని వెల్లడించిన బ్యూటీ, ఇదే ముహూర్తానికి తమకు పెళ్లి జరిగిందని, ఇప్పుడు అదే ముహూర్తానికి బాబు పుట్టడంతో ఆ టైమ్ అనేది తనకు మరింత స్పెషల్ గా మారింది అంటూ ఇన్స్టాగ్రామ్ లో తన న్యూ బార్న్ బేబీ ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోలో అప్పుడే పుట్టిన చిత్రా శుక్లా వారసుడు చూడడానికి క్యూట్ గా ఉన్నాడు. ప్రస్తుతం ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ బ్యూటీ 2023 డిసెంబర్ లో వైభవ్ ఉపాధ్యాయ అనే పోలీసు అధికారిని పెళ్లాడింది. ఇప్పుడు మగ బిడ్డని ప్రసవించి, ఆ ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటూ కొడుకు ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీంతో అభిమానులు ఈ సెలబ్రిటీ కపుల్ పేరెంట్స్ గా మారినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కాగా చిత్రా శుక్లా ఇండోర్ కు చెందిన అమ్మాయి. 2014 నుంచి ఈ బ్యూటీ సినిమాలు చేస్తూ వస్తోంది. బ్యాగ్రౌండ్ డాన్సర్ గా కెరీర్ ని మొదలు పెట్టిన ఈ హీరోయిన్ 2017లో రిలీజ్ అయిన 'మా అబ్బాయి' అనే తెలుగు సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కి పరిచయమైంది. పెద్దగా పాపులర్ కాకపోయినా చాలా వరకు సినిమాలలో నటించింది. తెల్లవారితే గురువారం, సిల్లీ ఫెలో, రంగుల రాట్నం, హంట్, పక్కా కమర్షియల్, ఉనికి, మస్తు షేడ్స్ ఉన్నయ్ రా, కలియుగ పట్టణం వంటి ఎన్నో సినిమాల్లో నటించి మంచి గుర్తింపును దక్కించుకుంది. మరి పెళ్లయిన తర్వాత ఈ హీరోయిన్ సినిమాల్లో నటిస్తుందా లేదంటే పర్సనల్ లైఫ్ కి పరిమితం అయిపోతుందా అనేది చూడాలి.

## వార్ 2 సెట్‌లో
# అడుగుపెట్టిన ఎన్టీఆర్!!



దేవర సినిమాతో తెలుగు సినీ ప్రేక్షకులను అలరించిన జూనియర్ ఎన్టీఆర్, తన తదుపరి ప్రాజెక్ట్‌గా బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫ్రాంచైజీ 'వార్' సిరీస్‌లోని రెండవ భాగం 'వార్ 2'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు సినిమా ఇండస్ట్రీలో స్టార్ ఎన్టీఆర్ మరియు బాలీవుడ్ యాక్షన్ హీరో హృతిక్ రోషన్ కలిసి నటిస్తున్నఈ చిత్రం ప్రస్తుతం చర్చలు రేపుతోంది. ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి, ముఖ్యంగా ఈ ఇద్దరు నటుల కలయికను చూస్తుండటంతో అందరిలో ఆసక్తి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో ఎన్టీఆర్ మరియు హృతిక్ రోషన్ కలిసి ఒక క్రేజీ డ్యాన్స్ నంబర్ చేయబోతున్నారు. ఈ ప్రత్యేక డ్యాన్స్ కోసం ప్రత్యేకంగా సెట్స్ ఏర్పాటు చేసి, షూటింగ్ జరుపుతున్నారు. ఈ నృత్యాన్ని ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ వైభవ్ మీర్చంట్ రూపొందిస్తున్నారు, ఇది సినిమా యొక్క ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. 'వార్ 2' సినిమాకు సంబంధించిన నటీనటుల జాబితాలో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ మరియు కియారా అద్వాని ఉన్నాయి, మరి ఈ చిత్రాన్ని అయ్యన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. దీనిని యాష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది, ఇది సినిమాకు మరింత పటిష్టతను ఇచ్చింది.

ఈ చిత్రం ప్రత్యేకంగా ఎందుకు ఉందంటే, పాన్ ఇండియా స్టార్‌ల కాంబినేషన్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రసిద్ధి చెందిన 'వార్' ఫ్రాంచైజీ, మరియు ప్రత్యేకమైన కథ ఆసక్తిని కలిగిస్తున్నాయి. అందువల్ల, 'వార్ 2' తెలుగు మరియు హిందీ సినిమా ప్రేక్షకులకు మరింత వినోదాన్ని అందించనుంది. ఎన్టీఆర్ మరియు హృతిక్ రోషన్ కలయిక, క్రేజీ డ్యాన్స్ నంబర్, యాక్షన్ సీన్స్ ఇవన్నీ కలిసి ఈ సినిమాను బ్లాక్‌బస్టర్‌గా మార్చుతాయని అంచనా వేయవచ్చు.

## సినీ నటుడు మోహన్‌రాజ్
# కన్నుమూత



దక్షిణాదికి చెందిన ప్రముఖ సినీనటుడు మోహన్ రాజ్ (72) కన్నుమూశారు. తెలుగుతోపాటు మలయాళం, తమిళ, కన్నడ చిత్రాల్లోనూ ఆయన నటించి మెప్పించారు. గురువారం కేరళలోని తిరువనంతపురంలో తుదిశ్వాస విడిచారు. నటుడు, దర్శకుడు దినేశ్ పనికర్ ఈ విషయాన్ని తెలియజేశారు. మోహన్‌రాజ్‌కు భార్య ఉష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మోహన్‌రాజ్ గత నాలుగు రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న మోహన్‌రాజ్‌ను వెంటిలేటర్ పై ఉంచారు. గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. గత కొంతకాలంగా పార్కిన్సన్ తో బాధపడుతున్న మోహన్ రాజ్ కు ఇటీవల గుండెపోటు కూడా వచ్చింది. చికిత్స నిమిత్తం మోహన్‌రాజ్‌ను చెన్నలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో కుటుంబసభ్యులు ఆయనను తిరువనంతపురంలోని కంజిరంకులం తీసుకువచ్చారు. అక్కడే మోహన్‌రాజ్ మృతి చెందారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో మోహన్‌రాజ్ ఎక్కువగా విలన్ పాత్రలనే చేశారు. తెలుగులో లారీ డ్రైవర్, శివయ్య అసెంబ్లీ రౌడీ, సమరసింహారెడ్డి చెన్నకేశవ రెడ్డి, తదితర సినిమాల్లో విలన్ పాత్రల్లో కనిపించారు. మోహన్ రాజ్ దాదాపు 300లకుపైగా సినిమాల్లో నటించారు. మోహన్‌రాజ్ మృతి పట్ల కేరళ సీఎం పినరయి విజయన్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి సాజి చెరియన్ సంతాపం తెలిపారు. పలువురు సినీప్రముఖులు మోహన్‌రాజ్ మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కాగా, మోహన్‌రాజ్.. కిరిక్కాడాన్ జోస్ పేరుతో మలయాళంలో వందల చిత్రాల్లో నటించి మెప్పించారు. 1089లో సిబి మలయిల్ దర్శకత్వంలో వచ్చిన కిరీదామ్ సినిమాతో మంచి పేరు తెచ్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఆఫీసర్‌గా పనిచేసే మోహన్ రాజ్.. సినిమాలపై మక్కువతో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. మూన్నం మూర చిత్రంలో మోహన్‌రాజ్‌నటించారు. ఆ సినిమాలో మోహన్ రాజ్ నటనను చూసిన సిబిమలయిల్.. తన సినిమాలో విలన్ పాత్రకు ఎంపిక చేశారు. ఆయన అంచనాలను నిజం చేస్తూ తన నటనతో ఎంతో ఎత్తుకు ఎదిగారు మోహన్ రాజ్. ఆ తర్వాత మలయాళంతోపాటు తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మోహన్ లాల్ నటించిన కిరీడమ్ చిత్రంలో కీరిక్కడన్ జోస్ గా విలన్ పాత్రలో కనిపించిన మోహన్ రాజ్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మూడు దశాబ్దాలపాటు ఆయన సినిమారంగంలో అనేక పాత్రలు పోషించి చెరగని ముద్ర వేశారు. కాగా, తెలుగులో మోహన్ రాజ్ నటించిన చివరి చిత్రం శివశంకర్. మోహన్ బాబు కథానాయకుడిగా రూపొందిన సినిమా ఇది.

# మొదలైన తలపతి విజయ్ ఆఖరి చిత్రం




మిళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా భావిస్తున్నచిత్రం 'తలపతి 69' ఈ చిత్రంలో తలపతి విజయ్ హీరోగా నటిస్తుండగా, ప్రముఖ దర్శకుడు హెచ్ వినోత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం పట్ల అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనడం విశేషం. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా కనిపించనుంది. అలాగే మలయాళ సినిమాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన మమతా బాయిజు కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటులు ప్రకాష్ రాజ్, ప్రియమణి, నరేన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ మరియు బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ వంటి సీనియర్ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. విజయ్ మరియు అనిరుధ్ కాంబినేషన్ గతంలో పలు విజయాలను అందించినందున, ఈసారి మళ్లీ మాజిక్ చేసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'తలపతి 69' చిత్రం పూజా కార్యక్రమం గ్రాండ్‌గా జరగగా, ఇందులో విజయ్, హెచ్ వినోత్ మరియు మిగతా తారాగణం హాజరయ్యారు. ఈ చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. విజయ్ అభిమానులకు ఈ చిత్రం పండగలాంటిదిగా భావిస్తారు, మరియు ఇది విజయ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని నమ్మకంగా భావిస్తున్నారు.

# ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్ 'కలి'



శివ సాషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మాణ సారధ్యంలో రుద్ర క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్కిన సినిమా 'కలి'. సస్పెన్స్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమా కి జీవన్ బాబు సంగీతం సమకూర్చగా ఈరోజే విడుదలైన ఈ సినిమా ఎలా ఉందో ఈ సమీక్షలోకి వెళ్లి తెలుసుందాం. శివరామ్ (ప్రిన్స్), వేద (నేహా కృష్ణ) ఇద్దరు ప్రేమించుకున్నారు. పెద్దలకు ఇష్టం లేకపోయినా ఎదురించి పెళ్లి చేసుకున్నారు. తన మంచి తనంతో తండ్రి వారసత్వం నుంచి వచ్చిన ఆస్తులను పోగొట్టుకుంటాడు శివరామ్. తన బంధువులే తనను మోసం చేయడం తో శివరాం బాధపడుతుంటారు. తన చేతకానితనంవల్లే తమ పరిస్థితి ఇలా అయ్యిందని వేద శివరామ్ ను వదిలివెళ్లిపోతుంది. ఒంటరితనంతో ఉన్న శివరామ్ కి సూసైడ్ ఆలోచనలు వస్తాయి. ఈ సమాజానికి తాను ఫిట్ అవునని ఉద్దేశ్యంతో ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే తన ఇంటికి ఎవరో వస్తారు. ఓ గేమ్ ఆడదామా అని ప్రిన్స్ ని రెచ్చగొట్టి ఆ ఆటను ముందుకు తీసుకెళతాడు. ఇంతకీ శివరామ్ ఇంటికి వచ్చిందెవరు? సూసైడ్ చేసుకోవాలనుకున్న శివరామ్ చివరికి ఎం చేశాడు. అనేదే ఈ సినిమా కథ. ప్రిన్స్ తన పాత్రలో సాదాసీదా వ్యక్తిగా కనిపించి మెప్పించాడు. నరేశ్ అగస్త్య కలి పురుషుడి పాత్రలో అద్భుతంగా నటించాడు. నేహా కృష్ణ, మణి చందన, సివిఎల్ నరసింహారావు, కెదార్ శంకర్ తమ పాత్రలను నిజాయతీగా చేశారు. చిన్న పాత్రలో కనిపించిన గాయత్రి గుప్తా తన నటనతో ఆకట్టుకుంది. ప్రియదర్శి, మహేష్ విట్టా, అయ్యప్ప శర్మ వాయిస్ ఓవర్ పనితనం పాత్రలకు మరింత బలం చేకూర్చింది. చిత్రం ఎక్కువ శాతం ఒకే ప్రదేశంలో, రాత్రి సమయంలోనే చిత్రీకరించబడింది

అయితే రమణ జాగర్లమూడి, నిశాంత్ కటారి సినిమాటోగ్రఫీ మెరుగ్గా ఉంది.జీవన్ బాబు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొంచెం ఎక్కువగా వినిపించినప్పటికీ, దృశ్యాలకు కాస్త బలం చేకూర్చింది. సినిమాలో ఒక్క పాట మాత్రమే ఉన్నా, ఆ పాట ఆకట్టుకునే విధంగా ఉంది. కలి పాత్రతో పాటు అతని నివాసం డిజైన్ అద్భుతంగా నిలిచాయి.లీలా గౌతమ్ వర్మ చిన్న బడ్జెట్‌తో నిర్మించబడినప్పటికీ, సినిమా నిర్మాణ విలువలు స్పష్టంగా కనిపించాయి.

# అమ్మ ఆమ్రపాలి టౌన్ ప్లానింగ్‌లో పూర్తిస్థాయి ప్రక్షాళన జరిగేనా.?

- మని ప్లానింగ్ సెక్షన్ గా మారిన టౌన్ ప్లానింగ్ సెక్షన్
- జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో పాతుకుపోయిన చైన్ మెన్ లు
- పది సంవత్సరాల నుండి ఒకే సర్కిల్ లో తిష్ట వేసిన వైనం
- సెక్షన్ ఆఫీసర్, ఏసిపిలకు కలెక్షన్ ఏజెంట్లుగా చైన్ మెన్ లు



టౌన్ ప్లానింగ్ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్

**హైదరాబాద్ (ప్రజా ప్రశ్న)** జిహెచ్ఎంసిలో పలు శాఖలు ఉన్నప్పటికీ ప్రధానంగా టౌన్ ప్లానింగ్ పేరు వినబడుతుంది అటువంటి టౌన్ ప్లానింగ్ లో పూర్తి స్థాయిలో ఉద్యోగుల ప్రక్షాళన జరగక పోవటంతో కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోయిన కొంతమంది అవినీతి అధికారులకు టౌన్ ప్లానింగ్ అడ్డాగా మారింది. గత పార్లమెంటు ఎన్నికల తర్వాత జిహెచ్ఎంసి లో పూర్తి స్థాయిలో ప్రక్షాళన వుంటుందని ప్రచారం జరిగినా కొన్ని విభాగాలలో బదిలీలు జరిగినా పూర్తి స్థాయిలో జరగలేవనే చెప్పాలి. ముఖ్యంగా జిహెచ్ఎంసిలోనే ప్రధాన విభాగమైన టౌన్ ప్లానింగ్ లో ఆ దిశలో పూర్తి స్థాయిలో ప్రక్షాళన జరగక పోవటంతో ఆ విభాగం డబ్బు అనే గబ్బు వాసనలో మునిగి తేలుతుంది ఈ విభాగానికి ప్రస్తుతం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఎందుకంటే ఒక పక్క మూసి రివర్ లో అక్రమణల తొలగింపు, చెరువులు ఎఫ్టీఎల్ బఫర్ జోన్ లలో ను పార్క్ స్థలాలలో అక్రమణల పై హైడ్రా కొరడా ఝులిపిస్తున్న నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ విభాగం ప్రధాన్యత సంతరించుకుంది. అయితే ఈ విభాగంలో అధికారుల నుండి కింది స్థాయి వరకు పూర్తి ప్రక్షాళన జరగక పోవటంతో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా మనీ ప్లానింగ్ విభాగంగా మారింది. ఈ విభాగంలో పై స్థాయి అధికారులను బదిలీలు చేసినా కింది స్థాయిలో సిబ్బందిని బదిలీలు చేపట్టక పోవటంతో అవినీతికి అంతు లేకుండా పోతుంది. కింది స్థాయిలో వున్న చైన్ మెన్ లు కొంత మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏళ్ళ తరబడి ఒకే దగ్గర పాతుకుపోవటంతో టౌన్ ప్లానింగ్ లో అక్రమాలకు పెద్ద ఎత్తున అవకాశం ఏర్పడింది. ఎసిపి, సెక్షన్ ఆఫీసర్ లను రెండు మూడు సంవత్సరాలకోసారి బదిలీ చేస్తున్న ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బంది పై దృష్టి సారించక పోవటంతో చైన్ మెన్ లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైంది. కొత్తగా వచ్చిన శిక్షణ ఆఫీసర్లు ఏసీపీలు చైన్ మెన్లను తమ ప్రైవేట్ కలెక్షన్ ఏజెంట్లుగా మార్చుకుంటూ అవినీతి అక్రమాలకు కొన్ని సర్కిల్లో తరలింపుతున్నారు అందుకు ఉదాహరణగా జిహెచ్ఎంసి సర్కిల్ 18 చెప్పుకోవచ్చు ఈ సర్కిల్లో జూబ్లీహిల్స్ చైన్ మెన్ గా ఓ వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు ఇతను గత పది సంవత్సరాల గా ఒకే సర్కిల్లో పనిచేయడంతో కొత్తగా వచ్చిన సెక్షన్ ఆఫీసర్ ఏసిపిలకు ఇతను కలెక్షన్ ఏజెంట్ గా తయారయ్యాడు ఎక్కడ అక్రమ నిర్మాణం జరిగిన అందులో ఇతను తల దూర్చడం అక్రమ వసూళ్లకు పాల్పడడం కొత్తగా వచ్చే సెక్షన్ ఆఫీసర్ ఏసిపి లకు అక్రమ వసూళ్లను పంచడం ఇలా జూబ్లీహిల్స్ సర్కిల్ లో అన్ని తానై వ్యవహరిస్తూ పుష్కరకాలంగా ఇతనిపై ఎన్ని అవినీతి ఆరోపణలు వస్తున్న ఉన్నత స్థాయి అధికారులను మేనేజ్ చేసుకుంటూ సర్కిల్ 18 జూబ్లీహిల్స్ సర్కిల్లో పాతుకుపోయాడు ఇతనిపై ఇప్పటివరకు పత్రికల్లో పలుమార్లు కథనాలు వచ్చినప్పటికీ ఉన్నతాధికారులను మేనేజ్ చేసుకుంటూ వ్యవహరిస్తున్నాడు అంటే ఇతని అక్రమ సంపాదన ఏ స్థాయిలో ఉంటుందో ఆలోచించాలి ఇలా జిహెచ్ఎంసి లోని అన్ని సర్కిల్లో ఇలా కొంతమంది కొన్ని సంవత్సరాలుగా పాతుకపోవడమే కాకుండా జిహెచ్ఎంసి నిబంధనలో తుంగలో తొక్కుతూ అక్రమ నిర్మాణాలను పెంచి పోషిస్తూ భారీ స్థాయిలో అక్రమ సంపాదనను వెనకేసుకుంటున్నారు, ఇక్కడే ఒక్కొక్కరు పది సంవత్సరాలు, కొందరు పాతిక సంవత్సరాలుగా ఒకే దగ్గర పాతుక పోయి ఉన్నతాధికారులకు సవాలుగా మారుతున్నారు. ఇక్కడ తమదే రాజ్యం తాము ఏం చెబితే అదే జరగాలి అంటూ హుకూం లు జరీ చేసే స్థాయికి ఎదిగారంటేనే తెలుస్తుంది వీరి ఆగడాలు, అక్రమ నిర్మాణాలను అరికట్టి అధికారులు చర్యలు తీసుకోవాలన్నా వీరి సలహాలే తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పరుచుకున్నారు. చైన్ మెన్ లు నిత్యం ఫీల్డ్ లో తిరుగుతూ అక్రమ నిర్మాణాలను గుర్తించి అధికారులకు తెలియజేయాలి. కాని వీరు ఫీల్డ్ లో తిరుగుతున్నా అక్రమ నిర్మాణాలను అడ్డుకోక పోగా అక్రమ నిర్మాణ దారులకు అండ దండలందిస్తున్నారు. ఇక్కడ తమదే రాజ్యం, మెం ఏం చెబితే అదే ఇక్కడ అమలవుతుంది అంటూ వారికి భరోసా ఇస్తూ ఒక్కో అక్రమ నిర్మాణానికి లక్షలలో వసూలు చేస్తున్నారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కొంత మంది పై అధికారులు ఫీల్డ్ తిరగకుండానే ఏ సమస్య లేకుండా చైన్ మెన్ లు తెచ్చిచ్చే కాసులకు కక్కుర్తి పడుతున్నారు. నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులను కొన్ని సర్కిల్ లలో సిబ్బందే భయపెట్టే పరిస్థితులు నెలకొన్నాయి. సంవత్సరాల తరబడి కింది స్థాయి లో సిబ్బందిని బదిలీ చేయని కారణంగా టౌన్ ప్లానింగ్ గతి తప్పుతుంది. చైన్ మెన్ లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అక్రమ నిర్మాణాలకు అంటకాగుతూ కోట్లకు పడగలెత్తారంటే టౌన్ ప్లానింగ్ లో అవినీతి ఏ రేంజ్ లో వుందో అవగతమవుతుంది.



జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి

మరో ఉదాహరణకు చందానగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ లో చైన్ మెన్ లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సంవత్సరాల తరబడి పాతుకు పోయి రాజ్యం చేస్తున్నారు. ఇక్కడ ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పాతిక సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ సర్కిల్ నే శాసిస్తున్నారు. ఇక్కడ చైన్ మెన్ లు పది సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. ఇంతవరకు మనం అనుకున్నట్టు జుబ్లీహిల్స్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ లోను ఇదే పరిస్థితి. ఇక్కడ చైన్ మెన్ లదే ఇష్టారాజ్యం . తరుచు అధికారులు మారుతుండటంతో చైన్ మెన్ ల పై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం లేకపోయింది. ఉన్నత అధికారులకు పది సంవత్సరాలుగా ఇక్కడి లోటు పాట్లు తెలుసుకున్న చైన్ మెన్ లు ఫీల్డ్ లో తిరుగుతూ అక్రమ నిర్మాణాల దారుల నుండి లక్షల రూపాయలు వసూలు చేయటం పనిగా పెట్టుకున్నారు. ఖైరతాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ చైన్ మెన్ లు సైతం పది సంవత్సరాలుగా ఇక్కడే తిష్టా వేసి కోట్లు కొల్లగొడుతున్నారు. జిహెచ్ఎంసి లోని అనేక సర్కిల్ ల టౌన్ ప్లానింగ్ విభాగాలలో ఇదే పరిస్థితి కొనసాగుతుంది. దీంతో టౌన్ ప్లానింగ్ పూర్తిగా అదుపు తప్పుతుంది. కింది స్థాయిలో పాతుకు పోయిన సిబ్బందిని బదిలీ లు చేయటంలో ఉన్నతాధికారుల అలసత్వం తో టౌన్ ప్లానింగ్ అవినీతి అక్రమాలకు అడ్డగా మారుతుంది. ఇప్పటికైనా కమిషనర్ ఆమ్రపాలి, జిహెచ్ఎంసి చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ లోని చైన్ మెన్ ల అవినీతి అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి జిహెచ్ఎంసి లోని అన్ని సర్కిలలో కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోయిన చైన్ మెన్ లను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి టౌన్ ప్లానింగ్ లో అవినీతి అక్రమాలకు కళ్లెం వేస్తారని గ్రేటర్ హైదరాబాద్ నగర పౌరులు ఆశిస్తున్నారు.

# అడుగుకో గుంత - గజానికో గొయ్యి

- గుంతలు మెట్టలుగా మారిన నగర రోడ్లు
- కంకర తేలి చెరువులను తలపిస్తున్న రోడ్డు
- గుంతల రోడ్లతో ఆవస్థలు పడుతున్న ప్రజలు
- అధ్వానంగా మారిన ప్రధాన రహదారులు
- బురదమయంగా బస్తీ రోడ్లు
- పట్టించుకోని జీఎచ్ఏంసీ అధికారులు
- మొద్దు నిద్రలో సంబంధిత అధికారులు
- రోడ్లను బాగు చేయండని వాహణదారుల మోర





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మహానగరంలో రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. వాహనాలు రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. పాదాచారులు నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు కాలనీలకు వెళ్లే రోడ్డు మొత్తం గుంతలు, మెట్టెలుగా మారి చిన్నపాటి చెరువులను తలపించేలా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లుంతా బురదమయంగా మారడంతో వాటిపై ప్రజలు నడవలేని దుస్థితికి చేరుకున్నాయి. దానికి తోడు రోడ్లపై కంకర తేలి నిత్యం ప్రమాదాలకు గురవుతున్నమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో రోడ్లు పాడవడంతో కనీసం మార్కెట్ లకు వెళ్ళీ నిత్యావసర సరకులు తెచ్చుకోవడం కూడా దుర్భరంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఉద్యోగాలకు వెళ్ళే ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా మారిందని సొంత టూవీలర్, కార్లలో వెళ్ళేవారి ఆవస్థలు వర్ణనాతీతం. గతుకుల రోడ్లపై ట్రాఫిక్ చక్రబందం నుండి గమ్యస్థానానికి చేరుకోవడం యుద్దాన్ని తలపిస్తుందని తెలిపారు. మరీ సంతోష్ నగర్ నుండి సిటీలోకి వచ్చేవారికి నల్గొండ చౌరస్తా దాటడానికే కనీసం గంట సమయం పడుతుందని విజయవాడ, శ్రీశైలం వైపు నుండి వచ్చే వారు నల్గొండ చౌరస్తా వద్ద కలవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుందని పలువురు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు మరమత్తులు చేసి ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కాలనీలలో రోడ్లు అధ్వానంగా తయారయాయని ఈ సమస్యపై జీఎచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు ఇబ్బందులకు గురవుచున్న అధికారులు మాత్రం మొద్దు నిద్రలో ఉన్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ రోడ్ల ను బాగుచేయండి మహాప్రభు అన్నా కూడా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్లను బాగు చేయాలని చేస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో రెండ్రోజులు వానలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ..!!



**హైదరాబాద్ (ప్రజా ప్రశ్న):** రాష్ట్రంలో రెండ్రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ను జారీ చేసింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ను జారీ చేసింది. శనివారం నిజామాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ను జారీ చేసింది. హైదరాబాద్లో రెండ్రోజుల పాటు మబ్బు పట్టి ఉంటుందని, మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. పొద్దున ఎండ.. సాయంత్రం వానరాష్ట్రంలో పొద్దునంతా ఎండ కొట్టగా.. సాయం త్రం కాగానే ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ సిటీ సహా పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గురువారం నల్గొండ, నాగర్కర్నూల్ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్, మెదక్, వికారాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షం పడింది. అత్యధికంగా నాగర్కర్నూల్ జిల్లా వేల్తూరులో 8.4 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో 7 సెంటీ మీటర్లు, ఎర్రారంలో 6.7, కోదండాపురంలో 6.3, నిర్మల్ జిల్లా అబ్దుల్లాపూర్లో 6.1, నల్గొండ జిల్లా చలకుర్తిలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ సిటీలో పలు చోట్ల మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. అంబర్పేటలో 2.3 సెంటీమీటర్లు, కంచన్బాగ్లో 2.1, ఆస్మాన్గఢ్లో 1.9, చంపాపేట్లో 1.9, హిమాయత్నగర్లో 1.7, ఎల్బీనగర్లో 1.4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయ్యింది. కాగా, ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో 40.9 డిగ్రీలు, సూర్యాపేట జిల్లాలో 40.6, కామారెడ్డి 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ (ప్రజా ప్రశ్న):** ముఖ్యమంత్రి పదవికి గత నెలలో రాజీనామా చేసిన 'ఆప్' జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన అధికారిక నివాసమైన నార్త్ ఢిల్లీ సివిల్?లైన్స్ లోని 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ రెసిడెన్స్‌ను శుక్రవారంనాడు ఖాళీ చేశారు. లుటియంస్ జోన్‌కు ఆయన మకాం మారుస్తున్నారు. ఆయన అధికారిక నివాసానికి ఉదయం రెండు మినీ ట్రక్కులు చేరుకోవడంతో షిఫ్టింగ్ ప్రక్రియ మొదలైంది. కేజ్రీవాల్, ఆయన భార్య సునిత కేజ్రీవాల్, కుమారుడు ఒక కారులోనూ, ఆయన తల్లిదండ్రులు, కుమార్తె మరో కారులోనూ బయలుదేరారు. మండి హౌస్ సమీపంలోని ఫరోజ్‌షా రోడ్డులో ఉన్న పంజాబ్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిట్టల్ అధికారిక నివాసంలో కేజ్రీవాల్ కుటుంబ సభ్యులు ఉండనున్నారు. ఈ బంగ్లా రవిశంకర్ శుక్లా లేన్‌లోని ఆప్ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉంది.కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన 2015 నుంచి సివిల్‌లైన్స్‌లోని 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డు నివాసంలోనే ఉంటున్నారు. సీఎంగా రాజీనామా చేసిన తర్వాత అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో తన నివాసాన్ని కేజ్రీవాల్ ఎంచుకోవడంపై 'ఆప్' ఎంపీ మిట్టల్ ఒక వీడియో సందేశంలో సంతోషం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ రాజీనామా చేసినప్పుడు ఆయనకు ఉండటానికి ఇల్లు లేదనే విషయం తెలిసి ఢిల్లీలోని తన నివాసానికి గెస్ట్‌గా రావాలని తాను కోరానని చెప్పారు. తన అభ్యర్థనకు కేజ్రీవాల్ ఆమోదం తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా, కేజ్రీవాల్ ఖాళీచేసిన అధికారిక బంగ్లాలోకి ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి వెళ్తారా లేదా అనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా అతిషి బాధ్యతలు చేపట్టినా, ఢిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ కూర్చున్న కూర్చీలో ఆమె కూర్చోవడం లేదు. ఆ పక్కనే మరో కుర్చీలో కూర్చిన ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో అతిషి ఇల్లు మారతారా లేదా అనేది సందేహంగానే ఉందంటున్నారు.

## ధరణి పోర్టల్ రద్దు.. త్వరలో కొత్త చట్టం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** ధరణి పోర్టల్ ను రద్దు చేసి త్వరలో ఆర్ఓఆర్ చట్టం తీసుకు వస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.ఈ నెలాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించాం.. ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటాం.. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ను గాలికి వదిలేసింది.. పూర్తైన ఇండ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఇక, వెంటనే మరమ్మత్తులు మౌలిక వసతులు కల్పిస్తాం.. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4 వేల ఇండ్లు మంజూరు.. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈనెల 7వ తేదీత ప్రజా ప్రభుత్వం ఏర్పాడి 10 నెలలు పూర్తి అవుతుంది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 10 నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేక పోయాం.. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తాం.. ఈ దసరా లోపు స్మార్ట్ కార్డులు ఇస్తాం.. అర్హతలను బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం.. రాబోయే నాలుగేళ్లలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి పేదలకు ఇళ్లు ఇస్తామన్నారు. జనవరి నుంచి ఆసరా పెన్షన్లు, సన్న బియ్యం పంపిణీ చేస్తాం.. రుణ మాఫీ కానీ రైతులకు 13 వేల కోట్ల రూపాయలతో త్వరలో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాలు సొల్లు మాటలు మాట్లాడుతున్నారు.. 10 ఏళ్లలో బీఆర్ఎస్ రైతులకు ఇచ్చింది 15 వేల కోట్లు మాత్రమే.. ప్రతిపక్ష పార్టీలు పోరం బోకు మాటలు మాట్లాడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.

## రుణమాఫీ చేసి తీరుతాం..

- ఏ ఒక్క రైతు అధైర్యపడొద్దు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు ప్రస్తుతం మాట్లాడుతున్నాయని మండిపడ్డారు.

రైతన్నల ఆదరణతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పుకొచ్చారు. కష్టమైనా.. ఒక పథకాన్ని ఆపైన సరే రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాను అమలు చేస్తామని మరోసారి స్పష్టంచేశారు. అన్ని సబ్సిడీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588